ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

గురువారం, ఏప్రిల్ 23, 2026 | సంపుటి - 22 | సంచిక 205 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam




## పర్యాటక రంగంలో 'రివర్స్ టూరిజం'

- ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్
- జెండా ఊపి ప్రారంభించిన మంత్రి జూపల్లి
- ఆదివాసీలతో కలిసి బస్సులో ప్రయాణించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

2

## ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక

- ఘనంగా క్రీడా యువజన కార్యక్రమాలు
- క్రీడోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రులు



వివరాలు2లో..

## రెండు వారాల తర్వాత విచారిస్తాం

- ఓటుకు నోటు కేసులో సుప్రీం ప్రత్యేక ధర్మాసనం నిర్ణయం

2

**న్యూఢిల్లీ, నినాదం:**

ఓటుకు నోటు కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం ఈ కేసును మరో రెండు వారాల తర్వాత విచారిస్తామని తెలిపింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ విజయ్ బిష్ణోయ్ కూడా సభ్యుడిగా ఉన్నారు. మంగళవారం ఈ కేసు విచారణ జరిగింది.

## సైబర్ నేరాలు పెరుగుతున్నయ్



- బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల ప్రక్షాళన అవసరం
- ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రాకు సిపి సజ్జనార్ లేఖ

వివరాలు6లో..

# పెద్దల చదువుకు పెద్దపీట

### వయోజనుల్లో అక్షరాస్యత పెంపుపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

- 2025–26 లో 6.31 లక్షల మంది పెద్దలు అక్షరాస్యత పరీక్షలకు హాజరు
- విద్యారంగంలో తెలంగాణ దూకుడు
- సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో వేగంగా సంస్కరణలు



**హైదరాబాద్, ఏప్రిల్ 22 (నినాదం):**

మారుతున్న కాలానికి తగినట్లు మారితేనే మనుగడ సాధ్యమవుతుంది.. ఈక్రమంలోనే విద్యా రంగంలోనూ పలు సంస్కరణలకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా శాఖను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పిల్లలంతా బడుల్లో ఉండడమే కాదు పెద్దలు సైతం అక్షరాలు నేర్చుకోవాలని... ఆధునిక కాలపు అవసరాలకు తగినట్లు తమను తాము మల్చుకోవాలనేది రాష్ట్ర ప్రభుత్వం యోచన. అందుకే వయోజన అక్షరాస్యత పెంపునపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనపర్చుతోంది. అదే సమయంలో పాఠశాల విద్యా రంగంపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

వివరాలు2లో..

## సీజ్‌ఫైర్ పొడిగింపు

- కాల్పుల విరమణ పొడిగించిన ట్రంప్
- స్పష్టమైన ప్రతిపాదనతో రావాలని ఇరాన్‌కు సూచన
- ఆర్థికంగా కుదేలవుతున్న ఇరాన్
- రోజుకు సుమారు 500 మిలియన్ల డాలర్లు నష్టం
- ట్రూత్ సోషల్ మీడియాలో వెల్లడించిన అమెరికా అధ్యక్షుడు
- జెడి వాన్స్ ఇస్లామాబాద్ పర్యటన రద్దు

6



## నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

### కాళేశ్వరం తదితర అంశాలపై చర్చించే అవకాశం

**హైదరాబాద్, నినాదం:** నేడు తెలంగాణ కేబినేట్ భేటీ అవుతోంది. వివిధ అంశాలపై కేటినేట్‌లో చర్చించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ తిరుగుతున్న న్యాయపరమైన ఉత్కంఠకు రేపటి కేబినెట్ సమావేశం ఒక దిశను చూపే అవకాశం ఉంది.

2



## ఉమ్మడి ఆంధ్ర మాజీ సిఎం నాదెండ్ల భాస్కరరావు మృతి

### చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన నేత

### పలువురు ప్రముఖుల సంతాపం

**హైదరాబాద్, నినాదం:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు (90) కన్ను మూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భాస్కర్ రావు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

6

## అన్ని మతాచారాలను ఒకే గాటన కట్టలేం

- వాస్తవ పరిస్థితులు, ఆచారాల నేపథ్యం కూడా ముఖ్యం
- శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశం కేసు విచారణ
- సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, నినాదం:**

మత స్వేచ్ఛ, సామాజిక సంస్కరణల మధ్య సమతుల్యత అనేది ఆయా కేసుల వాస్తవ పరిస్థితులు, ఆచారాల నేపథ్యంపైనే ఆధారపడి ఉంటుందని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ విచారణ కేవలం శబరిమలకే పరిమితం కాకుండా, మసీదుల్లోకి మహిళల ప్రవేశం, పార్శీ మహిళల హక్కుల వంటి ఇతర మతపరమైన అంశాలను కూడా స్పృశిస్తోంది.

2

# చర్యలు తీసుకోవద్దు

## కాళేశ్వరం ప్రాజెక్టుపై కెసిఆర్, హరీష్‌లకు ఊరట

## జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను నిలిపివేసిన హైకోర్టు



**హైదరాబాద్,ఏప్రిల్ 22(నినాదం):**

కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ధర్మాసనం నిలిపివేసింది. జస్టిస్ ఘోష్ కమిషన్ చట్టబద్ధమేనని న్యాయస్థానం తెలిపింది. అయితే రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పిటిషనర్లు కేసీఆర్, హరీశ్ రావుతో పాటు స్మిత సబర్వాల్, ఎస్కే జోషికి ఊరట లభించినట్లైంది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి జరిగిందంటూ రాష్ట్ర ప్రభుత్వం 2024 మార్చిలో జీవో నంబర్ 6ను జారీ చేస్తూ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది.

## కాళేశ్వరంపై ఎవ్వరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు

వివరాలు 2

- హైకోర్టు తీర్పుపై సిఎంతో ఉత్తమ్ చర్చలు
- తదుపరి కార్యాచరణపై ఇరు నేతల సమాలోచనలు
- సిబిఐ విచారణకు తీర్పు అడ్డం కాదన్న మంత్రి ఉత్తమ్

కాళేశ్వరం ప్రాజెక్టులో తెలంగాణ హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జస్టిస్ ఘోష్ కమిషన్ ఏర్పాటు సరైందని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసిందని తెలిపారు. సీబీఐకి ఘోష్ కమిషన్ పంపిన రిపోర్టుల్లో ఎవరి పేర్లను మెన్షన్ చేయలేదని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రి ఉత్తమ్ బుధవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్, హైకోర్ట్ తీర్పుపై చర్చించారు.

## తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

- పీసీ ఘోష్ కమిషన్ కాదు.. ముమ్మాటికీ పీసీసీ నివేదిక
- రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పనిచేయండి
- మీడియాతో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్
- ఎన్ని కుట్రలు పన్నినా న్యాయం గెలిచింది
- హైకోర్టు తీర్పుపై మాజీమంత్రి హరీష్ రావు

## అవినీతి విచారణలో సర్కార్ విఫలం

- అవకతవకలపై ఇన్నేళ్లయినా చర్యలు లేవు
- ప్రభుత్వ వైఫల్యాన్ని బయటపెట్టిన హైకోర్టు తీర్పు
- విమర్శలు గుప్పించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



## డిపోలకే పరిమితమైన బస్సులు

- ఆర్టీసీ సమ్మెతో బస్సులకు రెస్ట్
- డిపోల ముందు ధర్నాలతో కార్మికుల నిరసన
- నగరంలో అద్దె బస్సులను తిప్పిన ప్రభుత్వం
- చాన్నాళ్లకు ఆటోలు, క్యాబ్‌లకు పెరిగిన గిరాకీ
- నగరంలో మెట్రో సర్వీసులను పొడగించిన సర్కార్
- కార్మికుల సమస్యలపై సానుకూలంగా ఉన్నాట్లు ఎండి వెల్లడి

2




## నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

రాష్ట్ర మంత్రివర్గ అత్యవసర సమావేశం భేటీ అవుతోంది. హైకోర్టు ఇచ్చిన తీర్పులోని అంశాలను లోతుగా విశ్లేషించి, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం వేయబోయే తదుపరి అడుగు గురించి ఈ భేటీలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. ఈ పరిణామాలపై ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ, బీఆరఎస్ నేతలు ఆశించినట్లుగా వారికి కోర్టు నుంచి ఎటువంటి 'క్లీన్ చిట' లభించలేదని స్పష్టం చేశారు. కేసీఆర్ , హరీష్ రావు కోరినట్లుగా కమిషన్ ఏర్పాటును కోర్టు తప్పుబట్టలేదని, కేవలం కొన్ని సాంకేతిక అంశాలను మాత్రమే ప్రస్తావించిందని ఆయన వివరించారు. కమిషన్ నియామకాన్ని కోర్టు సమర్థించడం ప్రభుత్వ ధోరణికి దక్కిన విజయమని ఆయన అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ తిరుగుతున్న న్యాయపరమైన ఉత్కంఠకు రేపటి కేబినెట్ సమావేశం ఒక దిశను చూపే అవకాశం ఉంది.

## నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

**కాళేశ్వరం తదితర అంశాలపై చర్చించే అవకాశం**

హైదరాబాద్, : నేడు తెలంగాణ కేబినేట్ భేటీ అవుతోంది. వివిధ అంశాలపై కేటినేట్లఓ చర్చించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఘోష్ కమిషన్ విషయంలో తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సష్టించింది. ఈ తీర్పు నేపథ్యంలో తదుపరి కార్యాచరణను ఖరారు చేసేందుకు కేబినేట్‌లో చర్చించే అవకాశం ఉంది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం రాష్ట్ర మంత్రివర్గ అత్యవసర సమావేశం భేటీ అవుతోంది. హైకోర్టు ఇచ్చిన తీర్పులోని అంశాలను లోతుగా విశ్లేషించి, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం వేయబోయే తదుపరి అడుగు గురించి ఈ భేటీలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. ఈ పరిణామాలపై ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ, బీఆరఎస్ నేతలు ఆశించినట్లుగా వారికి కోర్టు నుంచి ఎటువంటి 'క్లీన్ చిట' లభించలేదని స్పష్టం చేశారు. కేసీఆర్ , హరీష్ రావు కోరినట్లుగా కమిషన్ ఏర్పాటును కోర్టు తప్పుబట్టలేదని, కేవలం కొన్ని సాంకేతిక అంశాలను మాత్రమే ప్రస్తావించిందని ఆయన వివరించారు. కమిషన్ నియామకాన్ని కోర్టు సమర్థించడం ప్రభుత్వ ధోరణికి దక్కిన విజయమని ఆయన అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ తిరుగుతున్న న్యాయపరమైన ఉత్కంఠకు రేపటి కేబినెట్ సమావేశం ఒక దిశను చూపే అవకాశం ఉంది.

## అన్ని మతాచారాలను ఒకే గాటన కట్టలేం

ఒక మతానికి చెందిన ఆచారం లేదా నిబంధనను ప్రాతిపదికగా తీసుకుని, అదే సూత్రాన్ని అన్ని మతాల ఆచారాలకు వర్తింపజేయడం సాధ్యం కాదని ధర్మాసనం పేర్కొంది. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశం, మతపరమైన ఆచారాల్లో ప్రభుత్వ జోక్యంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం కీలక విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు.. మత స్వేచ్ఛ, రాజ్యాంగ పరమైన హక్కుల మధ్య ఉన్న సున్నితమైన సంబంధాన్ని స్పష్టం చేస్తున్నాయి. మతపరమైన ఆచారాల్లో ప్రభుత్వం ఎంతవరకు జోక్యం చేసుకోవచ్చనే అంశంపై ముందస్తుగా ఎలాంటి ఉమ్మడి లేదా సార్వత్రిక నిబంధనలను విధించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తొమ్మిదిమంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ కీలక అంశాలపై స్పష్టతనిచ్చింది. ఆర్టికల్ 25 ప్రకారం పౌరులకు ఉన్న మత స్వేచ్ఛను గౌరవిస్తూనే, అవసరమైన చోట సామాజిక సంస్కరణల కోసం ప్రభుత్వం జోక్యం ఏ మేరకు ఉండాలనేది న్యాయస్థానం నిశితంగా పరిశీలిస్తోంది. ప్రభుత్వ జోక్యంపై ముందస్తుగా గైడ్‌లైన్స్ జారీ చేయడం వల్ల భవిష్యత్తులో వచ్చే వివిధ కేసుల విచారణకు ఆటంకం కలిగే ప్రమాదం ఉందని ధర్మాసనం భావించింది. మతపరమైన హక్కులు 'రాజ్యాంగ నైతికత'కు లోబడి ఉండాలా లేదా అనే కీలక ప్రశ్నపై ఈ విచారణ కొనసాగుతోంది. ఏడో రోజు విచారణ ద్వారా సుప్రీంకోర్టు మతపరమైన విషయాల్లో న్యాయవ్యవస్థ, ప్రభుత్వ పరిధులను అత్యంత జాగ్రత్తగా విశ్లేషిస్తోంది. శబరిమల తీర్పును పున:సమీక్షించే క్రమంలో వెలువడే ఈ నిర్ణయాలు భారతదేశంలోని అన్ని మతాల ఆచార వ్యవహారాలపై సుదూర ప్రభావం చూపే అవకాశం ఉంది. తొమ్మిది మంది సభ్యుల ధర్మాసనం తీసుకునే నిర్ణయం మతపరమైన హక్కుల విషయంలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలవనుంది.

## ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక

హైదరాబాద్,ఏప్రిల్ 22(ఆరవనవ): ప్రజా పాలన ,ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ఐటీ / పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ శ్రీధర్ బాబు , యువజన సర్వీసులు / క్రీడల శాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి మే 18 నుండి 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా యువజన క్రీడా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా క్రీడల శాఖ రూపొందించిన యువజన క్రీడోత్సవాల పోస్టర్‌ను బుధవారం ఉదయం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రధాన లక్ష్యం ప్రజలకు ప్రభుత్వ సేవలను వారి వద్దకే తీసుకెళ్లడం అని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. మే 1 నుండి 12 వరకు జిల్లా కేంద్రాల్లో ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నట్లు, అలాగే మే 18 నుండి 23 వరకు యువజన కేంద్రిత కార్యక్రమాలను క్రింది విధంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో రాష్ట్రవ్యాప్తంగా యువజనులు, క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని, అలాగే ఉద్యోగ మేళాలు మరియు ఇతర కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. అన్ని జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం అయ్యే విధంగా జిల్లా కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. ఏ. సోనిబాలా దేవి, ఐఎఫఎస్ గారు మాట్లాడుతూ, ఇటీవల గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ఐదు దశల్లో నిర్వహించిన సీఎం కప్ 2025 రెండవ ఎడిషన్‌లో సుమారు 5.64 లక్షల మంది క్రీడాకారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని తెలిపారు. 16 సంవత్సరాలు పైబడిన యువజనులను ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండి డా. సోనిబాలా దేవి, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, యువజన సర్వీసులు జాయింట్ డైరెక్టర్ వేణుగోపాల్, స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ డా. రవితేజ, టాస్క్ సీఈఓ నితిన్ రెడ్డి, డిఐడి అధికారి రాజేశ్వర్ రెడ్డి స్పోర్ట్స్ పి ఆర్ ఓ సురేష్ కాలేరు తదితరులు పాల్గొన్నారు.

## రెండు వారాల తర్వాత విచారిస్తాం

ముఖ్యంగా ఈ కేసులో రెండు కీలక పిటిషన్లు విచారణకు వచ్చాయి. ఒకటి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ కాగా, మరొకటి మాజీ ఎమ్మెల్యే, బీఆరఎస్ కీలక నేత సండ్ర వెంకట వీరయ్య దాఖలు చేసినది. సీఎం రేవంత్ రెడ్డి తన పిటిషన్‌లో ఓటుకు నోటు కేసును అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల ప్రకారమే విచారించాలని కోరారు. ఈ కేసును క్రిమినల్ అవినీతి కేసుగా కాకుండా ఎన్నికల ఉల్లంఘనగా పరిగణించాలని ఆయన వాదించారు. మరోవైపు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తనపై నమోదైన ఈ కేసులో తన పేరును పూర్తిగా తొలగించాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. తనపై ఉన్న ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని ఆయన వాదించారు. ఈ రెండు పిటిషన్లను కలిపి విచారించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. దీంతో ఈ కేసు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఓటుకు నోటు కేసు గతంలో కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా పడినప్పటికీ, ఈ కేసు ప్రాధాన్యం మాత్రం తగ్గలేదు. వచ్చే విచారణలో కోర్టు తీసుకునే నిర్ణయాలు రాజకీయంగా కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, నైతిక విలువలపై ఈ కేసు కీలకంగా నిలుస్తోంది.

## పర్యాటక రంగంలో 'రివర్స్ టూరిజం'

నిర్మల్, నినాదం: రాష్ట్ర పర్యాటక రంగ చరిత్రలో సరికొత్త ఒరవడికి నాంది పడింది. కేవలం నగరవాసులు ప్రకృతిని చూడటానికి పల్లెలకు వెళ్లడమే కాకుండా, అడవి బిడ్డలు సైతం ఆధునిక అభివృద్ధిని, చారిత్రక వైభవాన్ని కళ్లారా చూడాలన్న సంకల్పంతో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి క్రుష్ణారావు 'రివర్స్ టూరిజం'కు శ్రీకారం చుట్టారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం గోండు గూడెంలో బుధవారం నిర్వహించిన 'ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్'ను మంత్రి జూపల్లి కృష్ణారావు జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ఆదివాసీలకు కొత్త అనుభవాలు ఇవ్వడం, నగర జీవన విధానం పరిచయం చేయడం, ఆత్మవిశ్వాసం పెంచడం, రెండు సంస్కృతుల మధ్య అవగాహన పెంచడం, సాంస్కృతిక మార్పిడి, అంతిమంగా ఆదివాసీల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో ఈ వినూత్న కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు వివరించారు. కార్యక్రమాన్ని ప్రారంభించడమే కాకుండా, మంత్రి జూపల్లి స్వయంగా ఆదివాసీలతో కలిసి బస్సులో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రయాణ పొడవునా వారితో ముచ్చటిస్తూ పర్యటన లక్ష్యాన్ని వివరించారు. 'బయటి ప్రపంచంతో అనుసంధానం కావడం వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. నగరాల్లోని అభివృద్ధిని చూసి చదువుల పట్ల ఆసక్తి పెంచుకోవాలి. ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలి. అప్పుడే ఆదివాసీల జీవన ప్రమాణాల్లో మార్పులు వస్తాయి' అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివాసీల విశిష్ట సంస్కృతికి, నగర నాగరికతకు మధ్య ఈ కార్యక్రమం ఒక వారధిలా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు.



# పెద్దల చదువుకు పెద్దపీట

**హైదరాబాద్, నినాదం:**

**100 శాతం అక్షరాస్యత..**

**వయోజన విద్యకు ప్రాధాన్యం...**

సంపూర్ణ అక్షరాస్య రాష్ట్రంగా తెలంగాణను మార్చాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతుంది. 45 ఏళ్లు పైబడిన వయసులో అక్షరాస్యత తక్కువగా ఉండటాన్ని ప్రభుత్వం గుర్తించింది. దీంతో చాలా కాలంగా నిర్లక్ష్యానికి గురైన వయోజనుల విద్యపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎక్కడికక్కడ వయోజన విద్య తరగతులు నిర్వహించారు. దీంతో 2025–26 సంవత్సరంలో 6.31 లక్షల మంది పెద్దలు అక్షరాస్యత పరీక్షలకు హాజరయ్యారు. గత ప్రభుత్వం హయాంలో, ముఖ్యంగా 2019 నుంచి 2024 వరకు వయోజన విద్య పెంపు అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. దీంతో ఆ సమయంలో వయోజన విద్య పూర్తిగా కుంటుపడింది. అందుకు విరుద్ధంగా ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వయోజన విద్యపై ప్రత్యేక దృష్టి సారించింది. ఫలితంగానే వయోజన విద్యలో పెద్ద ఎత్తున పెరుగుదల నమోదైంది.

**పాఠశాలల్లో కొత్త మార్పులు**

తెలంగాణలోని పాఠశాలల్లో విద్యలో నాణ్యత పెంచేందుకు ప్రజా ప్రభుత్వం నూతన విధానాన్ని తీసుకొచ్చింది. అకడమిక్ ప్యానెల్ ఇన్స్పెక్షన్ టీమ్స్ ద్వారా పాఠశాలల్లో బోధన విధానాలను ఉన్నతీకరించింది. ఇది విద్యార్థులకు అత్యాధునిక పద్ధతులలో అభ్యసనలో మెలుకువలు నేర్పించేందుకు ఉపయోగపడింది. ముఖ్యంగా పెద్దపల్లి జిల్లాలో 61 పాఠశాలల్లో ఈ విధానం అమలు చేసి, బోధనలో ఉన్న ఇబ్బందులు, అనుకూలతలను గుర్తించారు. చాలామంది ఉపాధ్యాయులకు మంచి పరిజ్ఞానం ఉన్నప్పటికీ, తరగతుల్లో విద్యార్థుల భాగస్వామ్యం తక్కువగా ఉండడాన్ని ఈ టీమ్స్ గుర్తించాయి. దానిని సరిదిద్ది సమర్థంగా అమలు చేయడంతో మంచి ఫలితాలు తీసుకురావడం సాధ్యమైందని విద్యా శాఖ అధికారులు భావిస్తున్నారు.

**ఆరు నెలల్లోనే మంచి ఫలితాలు**

ప్రజా ప్రభుత్వ చర్యల ఫలితంగా తక్కువ సమయంలోనే పాఠశాల విద్యలో మంచి మార్పులు చోటుచేసుకున్నాయి. బోధన పద్ధతుల్లో వ్యూహాత్మకత 48% నుంచి 68%కు పెరిగింది. తరగతుల గదుల మెరుగైన నిర్వహణలో 42% నుంచి 65%కు, బోధనాభ్యసన సామగ్రి, వనరుల వినియోగం 35% నుంచి 58%కు పెరిగింది. ఇవన్నీ మంచి ఫలితాలు వచ్చేందుకు కారణమయ్యాయి.

**ప్రాథమిక విద్యపై ప్రత్యేక దృష్టి**

పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ప్రాథమిక దశలోనే అక్షరాలు రాయడం, అంకెలు నేర్చుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (FLN) పై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. దీంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2022–23 విద్యా సంవత్సరం నుంచి 2025–26 వరకు మంచి ఫలితాలు వచ్చాయి. తెలుగులో 9 శాతం నుంచి 35% శాతం వరకు... ఇంగ్లీష్ లో 4 శాతం, 29% శాతం... ఉర్దూ లో 19 శాతం నుంచి 40% శాతం వరకు అభ్యసన సామర్థ్యాలు పెరిగాయి. భాషతో పాటు అంకెలు నేర్చుకోవడం.. కూడికలు, తీసివేతలు వంటి గణిత ప్రక్రియల్లోనూ 18 శాతం నుంచి 30 శాతం ఫలితాలు అధికంగా వచ్చాయి.

**విద్యకు అత్యధిక నిధుల వినియోగం**

సమగ్ర శిక్షా పథకం కింద వచ్చిన నిధులను వినియోగించడంలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 2025–26లో 84% నిధులు వినియోగించుకొని రాష్ట్రం దేశంలో మొదటి స్థానంలో ఉంది. ప్రతి రూపాయి విద్య కోసం, విద్యార్థుల కోసం వ్యయం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. విద్యా రంగంలో ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు తెలంగాణను దేశంలో ముందువరుసకి తీసుకెళుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలు విద్యార్థులు, ఉపాధ్యాయులకు విద్యా వ్యవస్థ ప్రగతికి మరింత దోహదపడుతున్నాయి. విద్యా రంగంలో తెలంగాణ ఆదర్శ రాష్ట్రంగా ముందుకు సాగుతోంది.





# చర్యలు తీసుకోవద్దు

అయితే ఘోష్ కమిషన్‌ను సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో మాజీ సీఎం కేసీఆర్, హరీశ్ రావు, స్మిత సబర్వాల్, ఎస్కే జోషి పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానంలో సుదీర్ఘంగా విచారణ జరిగింది. ఈ పిటిషన్లపై ఏప్రిల్ 8న వాదనలు ముగియగా తీర్పును హైకోర్టు ఈరోజుకు(ఏప్రిల్ 22) వాయిదా వేసింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 6ను సమర్థించిన హైకోర్టు.. జీవో నంబర్ 6ను ఆధారంగా ఏర్పాటైన కమిషన్ నివేదికను అసెంబ్లీలో చర్చ జరగకుండానే మీడియా ముందుకు తీసుకురావడాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. కమిషన్ ఇచ్చిన నివేదికను ఆధారంగా చేసుకుని పిటిషనర్లపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తెలంగాణ హైకోర్టు తీర్పునిచ్చింది. కాళేశ్వరంపై హైకోర్టు తీర్పుతో కేసీఆర్‌కు ఊరట లభించిందని మాజీ సీఎం అడ్వకేట్ గండ్రమోహన్ రావు తెలిపారు. హైకోర్టు తీర్పుతో కమిషన్ రిపోర్టును చెత్తలో పడేయవచ్చన్నారు. సెక్షన్ 8 కింద విచారణ జరగలేదని చెప్పారు. పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటును హైకోర్టు సమర్థించిందని తెలిపారు. అయితే కమిషన్ రిపోర్టును పరిగణనలోకి తీసుకుని సీబీఐ దర్యాప్తు చేయరాదని న్యాయస్థానం చెప్పిందని కేసీఆర్ అడ్వకేట్ గండ్రమోహన్ రావు వెల్లడించారు.

**తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు**

కూలింది.. కాళేశ్వరం కాదని, కాంగ్రెస్ చేసిన కుట్రలని బీఆరఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆరఎస్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. హైకోర్టు తీర్పు కాంగ్రెస్ కుట్రలకు చెంపపెట్టు అని కేటీఆర్ అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పని చేయాలని హితవు పలికారు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, ముమ్మాటికీ పీసీసీ నివేదిక అని మేము ముందు నుంచి చెబుతుంది ఇవాళ అక్షరాల నిజమని తేలిపోయిందన్నారు.. కేసీఆర్‌పై దుష్ప్రచారం చేసిన వారి చెంప చెళ్లుమనించే విధంగా హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఇవాళ గెలిచింది.. తెలంగాణ ప్రజలు, రైతులు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కృషి చేసిన ఇంజినీర్లు. మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై దుష్ప్రచారం చేసింది. కాంగ్రెస్ కుట్రల వల్లే మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని మరోసారి చెబుతున్నా. రాష్ట్రంలో చెక్‌డ్యామ్‌లను బాంబులు పెట్టి పేలుస్తున్నారు. ఈ విషయంలో కేంద్రం ఏం చేస్తోంది? మేడిగడ్డలో ఏం జరిగిందో విశ్రాంత జడ్జితో మళ్లీ విచారణ జరిపించాలని కేటీఆర్ అన్నారు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షగట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టు తీర్పు ఒక గట్టి 'చెంపపెట్టు' అని కేటీఆర్ అభివర్ణించారు. రాజకీయ కక్ష సాధింపు కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న తీరును ఈ తీర్పు ఎండగట్టిందని ఆయన అభిప్రాయపడ్డారు. రెండున్నరేళ్లుగా కల్పతరువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ముక్కు నేలకు రాసి, రాష్ట్రంలోని అన్నదాతలకు క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే మేడిగడ్డ బ్యారేజీలో స్వల్పంగా దెబ్బతిన్న రెండు పిల్లర్లను రిపేర్ చేసి, రాష్ట్రంలోని లక్షలాది మంది రైతుల సాగునీటి కష్టాలు తీర్చాలని సూచించారు. రాజకీయ క్రీడ కంటే రైతుల ప్రయోజనాలే ముఖ్యమని కేటీఆర్ హితవు పలికారు.గోదావరి జలాలను పక్కరాష్ట్రానికి దోచిపెట్టి, తెలంగాణలో వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టే కుతంత్రాలను ఇంకా కొనసాగించాలని చూస్తే రేవంత్ సర్కారుకు రైతుల చేతిలోవాతలు తప్పవని కేటీఆర్ హెచ్చరించారు. ప్రాజెక్టుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ, రైతుల పొలాలకు నీరు అందకుండా చేస్తున్న ప్రభుత్వ వైఖరిని బీఆరఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

**ఎన్ని కుట్రలు పన్నినా న్యాయం గెలిచింది**

హైకోర్టు తీర్పుపై మాజీమంత్రి హరీష్ రావు

ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి పీసీ ఘోష్ నివేదికపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సోషల్ వీడియా ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందించారు. ఘోష్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం స్పష్టం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలు అయ్యాయని, రేవంత్ నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యిందంటూ హరీశ్ పోస్ట్ చేశారు. 'సత్యమేవ జయతే.. ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైంది. వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కమిషన్ చేసిన వ్యాఖ్యలు చెల్లవని, ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని స్పష్టంగా తీర్పునిచ్చింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలయ్యాయి. ప్రజా సమస్యలు పక్కనపెట్టి డ్రామాలు ఆడిన రేవంత్ రెడ్డి నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యింది. ఇప్పటికైనా కక్షసాధింపులు, రాజకీయ దుష్ప్రచారం మానేసి వెంటనే రెండు పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి తెలంగాణ రైతుల ప్రయోజనాలు కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఎవరు ఔనన్నా కాదన్నా... ముమ్మాటికీ కాళేశ్వరం తెలంగాణకు ప్రాణేశ్వరం.. జై తెలంగాణ.. జై కేసీఆర' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు ట్వీట్ చేశారు.



**కాళేశ్వరం అవినీతి విచారణలో సర్కార్ విఫలం**

కాళేశ్వరం అవినీతి విచారణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం అవకతవకలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికకు సంబంధించి బుధవారం తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఈ ప్రభుత్వ వైఫల్యాన్ని మరోసారి బట్టబయలు చేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగినట్లు ఆధారాలు ఉన్నప్పటికీ.. వాటిని చట్టపరంగా సమర్థవంతంగా కోర్టు ముందు ప్రవేశపెట్టడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా తగిన ఆధారాలను సమర్పించలేకపోవడం వల్ల, కమిషన్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యల విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వ నిర్లక్ష్యానికి, అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ మాటల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదని మరోసారి నిరూపితమైందని ఎద్దేవా చేశారు. ఈరోజు హైకోర్టు తీర్పు నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. ఎన్నికల హామీలు ఎందుకు అమలు కాలేదు..? అని ప్రశ్నించారు. అవినీతి కేసుల్లో చర్యలు ఎందుకు ఆలస్యమవుతున్నాయి..? అని నిలదీశారు.

# కాళేశ్వరంపై ఎవ్వరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ వీడియాతో చిట్ చాట్ చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 6ను కొట్టివేయాలని పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారని... కానీ జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటును హైకోర్టు తప్పుపట్టలేదని స్పష్టం చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నియామకాన్ని పూర్తిగా సమర్థించిందని తెలిపారు. కమిషన్ ఫైండింగ్స్‌ను కూడా హైకోర్టు తప్పుపట్టలేదని చెప్పుకొచ్చారు. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ చట్టం 1952లోని సెక్షన్ 3 ప్రకారం జీవో ఎంఎస్ నంబర్ `6 ద్వారా ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ రాజ్యాంగబద్ధమేనని న్యాయస్థానం స్పష్టం చేసిందని పేర్కొన్నారు. కమిషన్ ఏర్పాటు అధికార పరిధిని మించింది కాదని.. అసమంజసం కాదని, అక్రమం కాదని కూడా న్యాయస్థానం స్పష్టం చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదికలో కొందరు బాధ్యులపై చేసిన నిర్ధారణలపై హైకోర్టు అభ్యంతరం తెలిపిందని చెప్పారు. పిటిషనర్లకు నిర్ణీత ఫార్మాట్ ప్రకారం నోటీసు ఇవ్వలేదనే టెక్నికల్ అంశాన్ని తప్పుపట్టిందన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదిక ఆధారంగా వారిపై చర్యలు తీసుకోవద్దని పిటిషనర్లకు రిలీఫ్ ఇచ్చిందని చెప్పారు. ఇప్పటికే తమ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలు, అవకతవకలపై సీబీఐతో విచారణ చేపట్టాలని నిర్ణయించిందని అన్నారు. సీబీఐకు లేఖ రాశామని ప్రస్తావించారు. ఈ రోజు వెలువడిన హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదని.. న్యాయస్థానం ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. హైకోర్టు పూర్తి తీర్పును పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని ముమ్మాటికీ నిజమన్నారు. ప్రాజెక్టుకు ఎంచుకున్న సైట్ నుంచి డిజైన్ల నుంచి నిర్మాణాలు, నిర్వహణ అన్నిచోట్ల అవకతవకలు జరిగాయని.. అన్నీ లోపాలే ఉన్నాయని.. బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారికి నోటీసులు ఇవ్వలేదనే కారణంగా, వాళ్లపై కమిషన్ చేసిన రిమార్క్స్ మాత్రమే ఇన్ ఆపరేటివ్‌గా ఉంటాయని హైకోర్టు తెలిపిందని అన్నారు. ఇది పూర్తిగా ప్రొసిజరల్, టెక్నికల్ అంశమని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం ప్రజల కళ్లముందే కుంగిపోయిందని.. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాక్ కుంగిపోయిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆ బ్యారేజీ దగ్గరికు వెళ్తే ఎవరికైనా కుంగిన తీరు కనపడుతుందన్నారు. లక్ష కోట్లతో కట్టిన బ్యారేజీ మూడేళ్లకే కుంగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆరఎస్ హయాంలో కట్టిన ప్రాజెక్టు వాళ్ల హయంలోనే కుంగిపోయిందని అన్నారు. అందుకు కారణాలేమిటో తేల్చాల్సిన బాధ్యత.. తమ ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కూడా బ్యారేజీల కుంగుబాటుకు దారి తీసిన కారణాలు, డిజైన్ల, నిర్మాణం, నిర్వహణ లోపాలపై తమ ప్రాథమిక నివేదికను బీఆరఎస్ హయాంలోనే సమర్పించిందని అన్నారు. బ్యారేజీలకు ఎంచుకున్న ప్రాజెక్టు సైట్ నుంచి డిజైన్లు, నిర్మాణంలో జరిగిన లోపాలన్నింటినీ తమ ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ కమిషన్ బయటపెట్టిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాలు, అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన రిటైర్డ్ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కూడా ఇంజనీర్లను, ఐఏఎస్‌లను, అప్పటి పరిపాలనా బాధ్యులను విచారించి నివేదికను వెల్లడించిందని తెలిపారు. బాధ్యులెవరు, దోషులెవరు.. ఎక్కడెక్కడ తప్పులు జరిగాయో తేలుస్తామని చెప్పారు. ఏమేం లోపాలున్నాయో.. ఎన్డీఎసఏతో పాటు విజిలెన్స్, పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలపై ఆగస్టులోనే తమ ప్రభుత్వం అసెంబ్లీలో చర్చకు పెట్టిందని ప్రస్తావించారు.

# డిపోలకే పరిమితం అయిన బస్సులు

**హైదరాబాద్, నినాదం:**

చాలాలకాలం తరవాత ఆర్టీసీ బస్సులు సేదదీరుతున్నాయి. సమ్మె కారణంగా అన్ని బస్సులు ఆయా డిపోలకే పరిమితం అయ్యాయి. తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో బస్ డిపోల్లో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. డిపోల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సమ్మెతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కార్మికుల సమ్మెతో పెద్దపల్లిలో 150 బస్సులు డిపోనకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. మహబూబ్‌నగర్‌లో 112 బస్సులు డిపోనకే పరిమితం కాగా.. ప్రయాణికుల కోసం 16 విద్యుత్ బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఆర్టీసీ అద్దె బస్సులను నడుపుతోంది. కండక్టర్ లేకుండా వీటిని తిప్పుతోంది. మరోవైపు బస్సులు లేక పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. అన్ని జిల్లాల వ్యాప్తంగా అర్ధరాత్రి నుంచే బస్సులను డిపోలకు పరిమితం చేశారు. రహదారులపై బైఠాయించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి బస్సులన్నీ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి మహానగరంలో దాదాపు రోజుకు 25 లక్షల మంది ప్రజా రవాణాను వినియోగిస్తున్నారు. ఇదే అదనుగా వారు అధిక ఛార్జీలను వసూలు చేస్తున్నారు.కరీంనగర్‌లో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రైవేటు డ్రైవర్‌తో నడిపిస్తున్న అద్దె బస్సు లారీని ఢీకొట్టింది. కరీంనగర్‌లోకి కోతిరాంపూర్ బైపాస్ వద్ద బస్సు అదుపు తప్పడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. కాగా, శిక్షణ లేని డ్రైవర్లతో బస్సులు నడిపిస్తుండటం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీజీఎస్ ఆర్టీసీ కార్మికుల సమ్మెతో హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. మెట్రో రైళ్ల సంఖ్య, ఫ్రీక్వెన్సీ పెంచాలని నిర్ణయించారు. ఆర్టీసీ సమ్మె ముగిసేవరకూ 56 మెట్రో రైళ్లను నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు. మియాపూర్` ఎల్.బి.నగర్ కారిడార్‌లో 4 నిమిషాల 20 సెకన్ల విరామంతో, అలాగే నాగోల్` రాయదుర్గం కారిడార్‌లో 3 నిమిషాల 40 సెకన్ల విరామంతో రోజంతా గరిష్ఠంగా 56 రైళ్లను నడపనున్నట్లు తెలిపారు. చివరి మెట్రో రైలు సర్వీస్ రాత్రి 11 గంటల తర్వాత కూడా పొడిగించేలా చర్యలు చేపట్టినట్లు మెట్రో అధికారులు పేర్కొన్నారు. అయితే, కార్మికుల సమ్మెతో నగరవాసులు మెట్రో రైళ్లపై ఆధారపడాల్సి వచ్చింది. ఉదయం నుంచి రైళ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు తండోపతండాలుగా మెట్రోస్టేషన్లకు తరలివస్తున్నారు. పెరిగిన ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 56 మెట్రో రైళ్లను నడపాలని అధికారులు నిర్ణయించారు. మరోవైపు కార్మికుల సమ్మెపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కొన్ని సంఘాలు నిజాలను విస్మరించి కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. సమస్యలు పరిష్కరించాలంటూ ఆర్టీసీ జేఏసీ సమ్మె బాట పట్టింది. మంగళవారం నాడు అధికారులతో చర్చలు విఫలం కావడంతో ఆందోళనకు దిగారు ఆర్టీసీ కార్మికులు. బస్సులను డిపోలకే పరిమితం చేసి రోడ్లపై బైఠాయించి నిరసనలకు దిగారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని తేల్చి చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సమ్మె విరమించాలని కార్మికులను కోరుతోంది. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా బస్సులు నడపాలని సంబంధిత ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# వర్షాకాలానికే గోదావరి జలాలు అందించాలి

## వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం... సత్తుపల్లి ట్రంక్ కాలువ పనుల్లో అలసత్వం వద్దు

## క్షేత్రస్థాయిలో సీతారామ ప్రాజెక్టు పనుల పరిశీలన.. ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అధికారులతో మంత్రి సమీక్ష





**కొత్తగూడెం, ఏప్రిల్ 22(నినాదం)**

సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన సత్తుపల్లి ట్రంక్ కాలువ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, రాబోయే వర్షాకాలం నాటికే ఆయకట్టుకు గోదావరి జలాలు అందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం సత్తుపల్లి నియోజకవర్గంలోని యతలకుంట వద్ద అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టితో కలిసి మంత్రి ప్రాజెక్టు పనులను సమీక్షించారు.

**క్షేత్రస్థాయిలో పరిశీలన.. అధికారులపై ఆగ్రహం**

సమీక్షకు ముందు మంత్రి అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టి పంప్ హౌస్ నుండి యతలకుంట వరకు సాగుతున్న కాలువ పనులను స్వయంగా పరిశీలించారు. బ్రిడ్జిలు, రోడ్డు క్రాసింగ్ల వద్ద పనులు నత్తనడకన సాగడంపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ అధికారులు అలసత్వం వీడి పనులను ముమ్మరం చేయాలని, పర్యవేక్షణ పెంచాలని సూచించారు.

**సమీక్షా సమావేశంలోని ముఖ్యాంశాలు:**

లక్ష్యం: రూ.700 కోట్ల అంచనా వ్యయంతో 43 కి.మీల మేర సాగే ఈ కాలువ ద్వారా 1.46 లక్షల ఎకరాలకు నీరందించడమే లక్ష్యం. ఇప్పటికే రూ.600 కోట్ల పనులు పూర్తయ్యాయి.

టన్నెల్ పనులు: యతలకుంట టర్మినల్ వద్ద పెండింగ్‌లో ఉన్న చివరి 30 మీటర్ల పనులను 15 రోజుల్లోగా పూర్తి చేయాలి.

భూసేకరణ: భూసేకరణకు అవసరమైన నిధులు మంజూరయ్యాయని, చిన్నచిన్న కోర్టు కేసులు లేదా భూ సమస్యలు ఉంటే కలెక్టర్ల ద్వారా వెంటనే పరిష్కరించుకోవాలి. సమస్యలను సాకుగా చూపి పనులు ఆపితే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు.

సమన్వయం: పనులు భద్రాద్రి జిల్లాలో, ఆయకట్టు ఖమ్మం జిల్లాలో ఉన్నందున ఇరు జిల్లాల అధికారులు, పోలీస్, అటవీ శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలి.

**ఉభయ జిల్లాలు సస్యశ్యామలం..**

గత ప్రభుత్వం టన్నెల్ నిర్మాణంపై కాలయాపన చేసినా, తమ ప్రభుత్వం రెండేళ్లలోనే టన్నెల్‌ను పూర్తి చేసిందని మంత్రి పేర్కొన్నారు. "ఈ ఏడాది నాగార్జున సాగర్ జలాలు అందకపోయినా.. వైరా ఆయకట్టు, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి మండలాలకు గోదావరి జలాలను మళ్లించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం" అని తెలిపారు. 4వ పంప్ హౌస్ పూర్తయితే అశ్వరావుపేట, దమ్మపేట మండలాలకు కూడా జలాలు అందుతాయని, దీనివల్ల ఉమ్మడి జిల్లాలోని 8 నియోజకవర్గాలకు మేలు జరుగుతుందని తుమ్మల వివరించారు. జూలూరుపాడు టన్నెల్ పూర్తి చేయడం ద్వారా పాలేరుకు, అలాగే మారేళ్లపాడు లిఫ్ట్ ద్వారా పినపాక నియోజకవర్గంలోని 16,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాల ఇంజనీరింగ్, పోలీస్, అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకండి

## ధరిత్రిని (భూమి), ప్రకృతిని కాపాడండి: జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్లగొండ ప్రతినిధి ఏప్రిల్ 22( నినాదం)**

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కారణంగా దరిత్రితోపాటు, ప్రకృతి పెను విపత్తును ఎదుర్కొంటున్నదని, దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాతృ భూమి దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా యువజన సర్వీసులు, క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని కేంద్రీయ విద్యాలయ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించిన సైకిల్ ర్యాలీని కేంద్రీయ విద్యాలయ వద్ద ఆయన జండా ఊపి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, మీడియాను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల ప్రపంచం పెను ప్రమాదంలో చిక్కుకుందని, దీనివల్ల వాతావరణ, జల, భూమి కాలుష్యాలు ఏర్పడుతున్నాయని అన్నారు.మానవ తప్పిదాలు, వివాదాల వల్ల మనుషులతో పాటు, జంతుజాలానికి కూడా ప్రమాదం ఏర్పడిందని అన్నారు. ప్లాస్టిక్ వినియోగం అనంతరం డీకంపోస్టు చేయకపోవడం వల్ల ఇది భూమితోపాటు, ప్రకృతిని నాశనం చేస్తున్నదని, దీని నుండి బయట పడేందుకు ప్రతి ఒక్కరు పెద్ద ఎత్తున మొక్కలు నాటి దరిత్రిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు . మొక్కలు నాటి సంరక్షించడంతోపాటు, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, ఒక వేళ వాడినట్లైతే తిరిగి దానిని వినియోగించడం, రీసైకిల్, చేయడం వంటి వాటిపై దృష్టి సారించాలని, ఈ నినాదం ప్రతి గృహానికి వెళ్లే లా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అప్పుడే మనం భూమిని, ప్రకృతిని కాపాడగలుగుతామని అన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా ప్రతి ఒక్కరూ బయటికి లేదా మార్కెట్ కు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా కాటన్ చేతి సంచులు వాడాలని, ప్లాస్టిక్ వాటర్ బాటిల్ కు బదులు స్టీల్ లేదా మట్టి బాటిల్స్ వాడడం, ప్లాస్టిక్ మెటీరియల్ వాడకుండా చూడాలని, ఈ విషయంపై అన్ని చోట్ల అవగాహన కల్పించాలని తెలిపారు .రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా అన్ని చోట్ల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం ప్రకృతిని కాపాడే అంశంపై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలన్నారు."అంతర్జాతీయ మాతృభూమి దినోత్సవం" సందర్భంగా ప్రతి ఒక్కరు భూమి కి ప్రతిరూపమైన అమ్మను గుర్తుంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతిని కాపాడుకునే ప్రయత్నం చేయాలని, అప్పుడే మనం అనుకున్న అందమైన జీవితాన్ని గడపగలుగుతామన్నారు. డి ఎఫ్ ఓ రాజశేఖర్, జిల్లా యువజన ,క్రీడల అభివృద్ధి శాఖ అధికారి మహమ్మద్ అక్బర్ అలీ, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీనివాసులు తదితరులున్నారు

# చంద్రమౌళి మరణ వార్త విని దిగ్భ్రాంతికి లోనైనా

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హుజూర్ నగర్, ఏప్రిల్ 22 (నినాదం):**

గంజి చంద్రమౌళి మరణ వార్త విని మంత్రి ఉత్తమ్ దిగ్భ్రాంతికి గురయ్యారు. హుజూర్నగర్ పట్టణంలో మొట్టమొదటిగా లక్ష్మీ నరసింహా ఫంక్షన్ హాల్ ను స్థాపించి విజయవంతమైన వ్యాపారవేత్తగా అలాగే కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం అహర్నిశలు కృషి చేస్తు నాకు కష్ట కాలంలో తోడున్న ఆప్త మిత్రుని కోల్పోవడం చాలా బాధాకరమనీ వారి కుమారుడు గంజి శివ మరియు వారి కుటుంబ సభ్యులందరికీ నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తు వారి కుటుంబానికి అండగా ఉంటానని మంత్రి ఉత్తమ్ తెలిపారు.

# వర్షాలు రాకముందే పనులు పూర్తి చేయాలి

## ప్రగతి ప్రణాళిక లక్ష్యాలను సాధించుకోవాలి: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):**

వర్షాకాలానికి ముందే అన్ని సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలో మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం మొగుళ్లపల్లి మండలంలోని మహాత్మ జ్యోతిబా పూలే పాఠశాలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మరమ్మతులు చేయాల్సిన పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ, బీసీ మైనారిటీ, మహాత్మ జ్యోతిబాపూలే, మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలో మరమత్తులకు సంబంధించి ప్రతిపాదనలు అందజేయాలని ఆయన సంబందిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. 31 పాఠశాలల్లో చేపట్టిన మరుగుదొడ్ల పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని పాఠశాలలో నూరు శాతం మంచినీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా ఉండాలని స్పష్టంచేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, మంచినీటి సరఫరా పునరుద్ధరణ పనులను మే 10 వరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. టెండర్ ప్రక్రియ పూర్తి అయిన పనులకు అగ్రిమెంట్ పూర్తి చేసి పనులు ప్రారంభించాలని తెలిపారు. టెండర్ పూర్తి అయిన పనులను తక్షణమే మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 20 నుండి 26 వరకు నిర్వహించనున్న "వెల్ఫేర్ వీక్" సందర్భంగా అన్ని రకాల సంక్షేమ హాస్టల్లో సంబంధిత శాఖల సంక్షేమ అధికారులు ప్రణాళిక ప్రకారం నిర్వహించాలని సూచించారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాల లక్ష్యాలను సాధించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వెల్ఫేర్ వీక్ కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు జరిగే కార్యక్రమానికి రిపోర్టులు పంపాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి , డీఈఓ రాజేందర్, బిసి సంక్షేమ అధికారి ఇందిర, పీఆర్, గిరిజన, టీడబ్ల్యుఐడిసి ఇంజనీరింగ్ అధికారులు, తహసీల్దార్ సునీత, ఎంపిడివో సురేందర్, సర్పంచ్ విజయ, ప్రిన్సిపల్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.



# పేదింటి అమ్మాయి వివాహానికి మాజీ మంత్రి ఆత్మీయ కానుక

**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 22 (నినాదం)**

వనపర్తి పట్టణానికి చెందిన పేదింటి అమ్మాయి ఎన్.అమూల్య(విశ్వకర్మ) వివాహం ఈ నెల 26న జరగనుంది.ఈ విషయాన్ని నాయకులు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి దృష్టికి తీసుకురాగా స్పందించిన నిరంజన్ రెడ్డి బుధవారం ఎన్.అమూల్యను ఆశీర్వదించి పుస్తే మెట్టే, నూతన వస్త్రాలు అందించారు. ఆత్మీయ కానుక అందుకున్న అమూల్య కుటుంబ సభ్యులు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పలుస రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్, కౌన్సిలర్ శ్రీకర్ గౌడ్, బంగారు అనిల్, మోహనా చారి, ప్రసాదా చారి, చాణక్య చారి, నాగరాజు, రాము తదితరులు ఉన్నారు

# ఎల్ ఓసి అందజేసిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు

**కోరుట్ల, ఏప్రిల్ 22 (నినాదం)**



కోరుట్ల నియోజక వర్గ పరిధిలోని మెట్ పల్లి పట్టణానికి చెందిన కటుకం రాజేష్ కుమార్ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతుండగా ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.1 లక్ష 75 వేల విలువైన ఎల్ఓసి ని బాధిత కుటుంబ సభ్యులకు జువ్వాడి కృష్ణారావు ఆ అందించారు. ఈ సందర్భంగా బాధితుడు కటుకం రాజేష్ కుమార్ మాట్లాడుతూ ఎల్ఓసి మంజూరు కు సహకరించిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు లకు కృతజ్ఞతలు తెలియజేశారు.



# వోక్స్ వాగన్ టైగన్ ఫేస్ లిఫ్ట్ లాంచ్ చేసిన సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి

## టీపిసిసి రాష్ట ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు

**కరీంనగర్, ఏప్రిల్ 22(నినాదం):**

పీపీఎస్ మోటార్స్ వోక్స్ వాగన్ టైగున్ ఫేస్ లిఫ్ట్ మోడల్ నూతన వాహనాన్ని బుధవారం కరీంనగర్ పట్టణం కోతిరాంపూర్ లో గల వోక్స్ వాగన్ షో రూమ్ లో కరీంనగర్ సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి తో కలిసి టీ పీ సి సి రాష్ట ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు షోరూమ్‌లో నూతనంగా ప్రవేశపెట్టిన అత్యాధునిక వాహనం టైగున్ ఫేస్ లిఫ్ట్ వాహనం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5 స్టార్ గ్లోబల్ ఎన్ క్యాప్ రేటింగ్ , చైల్డ్ సేఫ్టీ ఫైవ్ స్టార్ రేటింగ్ భద్రత ప్రమాణాలు పాటిస్తూ ఆధునిక డిజైన్, నూతన టెక్నాలజీ, అత్యుత్తమ భద్రతా ప్రమాణాలు మరియు శక్తివంతమైన పనితీరుతో రూపొందిన టైగున్ ఫేస్ లిఫ్ట్ వాహనం బాగుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ లు పడిశెట్టి వసంత భూమయ్య , మాసం గణేష్ , అల్ ఇండియా స్టూడెంట్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ బుర్ర సంజయ్ కుమార్ , యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కిమ్ ఫహద్ , ప్రశాంత్ , నారోజు రాకేష్ చారి, బద్దం ప్రవీణ్ రెడ్డి మల్లేశం , క్రాంతి కుమార్ , వోక్స్ వాగన్ జనరల్ మేనేజర్ నాగార్జున రెడ్డి , క్లస్టర్ హెడ్ ప్రవీణ్ కుమార్ , మరియు సిబ్బంది బద్రి లక్ష్మణ్ , గుర్రం రాజు రెడ్డి , సైదులు , సంపత్ తదితరులు పాల్గొన్నారు

# స్తంభించిన ప్రజా రవాణా.. సమ్మెతో డిపో దాటని ఆర్టీసీ బస్సులు

## గమ్యస్థానాలు చేరడానికి ప్రయాణికుల ఇబ్బందులు.. ప్రైవేట్ వాహనాలు దిక్కు





**భూపాలపల్లి ప్రతినిధి, ఏప్రిల్ 22(నినాదం):**

తమ న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెతో ప్రజా రవాణా స్తంభించిపోయింది. బుధవారం ఉదయం నుండి ఆర్టీసీ బస్సులు డిపోలు దాటకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఉద్యోగులు, తమ రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్సులు బస్సులు నడవకపోవడంతో బస్టాండ్లు వెలవెలబోయాయి. భూపాలపల్లి డిపో నుండి బస్సులు బయటకు రాకుండా ఆర్టీసీ జేఏసీ నాయకులు, కార్మికులు అడ్డుకున్నారు. డిపో ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. పరిష్కరించేంతవరకు బస్సులను నడవనీయబోమని భీష్మించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ జేఏసీ నాయకులు, కార్మికులు, పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్మెంట్ తో అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం కింద ప్రభుత్వం ఇవ్వాల్సిన డబ్బులు ప్రతినెల కోత విధించకుండా ఇవ్వాలని పాత బకాయిలను విడుదల చేయాలని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల ఉద్యోగ భద్రత కల్పన, బెడ్ విన్నర్ స్కీంలో పనిచేస్తున్న వారందరిని రెగ్యులర్ చేయడం, ట్రేడ్ యూనియన్ల పై ఆంక్షలు ఎత్తివేయడం, గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణ, అన్ని కేటగిరీలో పనిచేస్తున్న ఉద్యోగులపై అధిక పనివారాలు తగ్గించడం, ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు, రద్దీకనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచడం, అలీల భర్తీ ఆర్టీసీ మహిళా కార్మికుల సమస్యల పరిష్కారం, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపు లాంటి ప్రధాన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు, కార్మికులు విజ్ఞప్తి చేశారు.

**మాజీ మాజీ ఎమ్మెల్యే గండ్ర సంఘీభావం..**

ఆర్టీసీ కార్మికుల సమ్మెకు భూపాల్ పల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి సంఘీభావం తెలిపారు. కార్మికుల ధర్నా వద్దకు చేరుకొని వారికి మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల సమస్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడానికి బిల్లును గవర్నర్ వద్దకు పంపించడం జరిగిందని కానీ అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయిందని పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం తమ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అసలు సమస్య మొదలైందని లేకుంటే ఇప్పటికి ఎప్పుడో ఆర్టీసీ విలీన ప్రక్రియ పూర్తయ్యేదని మాజీ ఎమ్మెల్యే అన్నారు. ఆర్టీసీ కార్మికుల పక్షాన బిఆర్ఎస్ పార్టీ నిలబడి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

**ప్రయాణికుల ఇబ్బందులు..**

ఆర్టీసీ కార్మికుల సమ్మెతో బస్సులు నిలిచిపోవడం కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానికులు తమ తమ గమ్యస్థానాలు చేరుకోవడానికి నానా అవస్థలు పడ్డారు. బస్సులు డిపోలు దాటి రాకపోవడంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలపై ఆధారపడి తమ గ్రామాలకు చేరుకున్నారు. ప్రైవేట్ వాహనాలు సైతం ప్రయాణికులతో కిక్కిరిసిపోవడంతో ప్రయాణికులు ఎర్రటి ఎండలో రహదారులపై వేచి ఉన్నారు. విద్యార్థులు ఉద్యోగులు తమ విధులకు హాజరు కావడానికి అపసోపాలు పడ్డారు. సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో సమయానికి కార్యాలయాలకు, కళాశాలకు చేరుకోలేకపోయారు. అత్యవసర పనుల పైన వెళ్లేవారు స్వతహాగా ప్రవేట్ వాహనాలను అద్దెకు తీసుకొని వెళ్లాల్సి వచ్చింది. బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనదారులకు అధిక డిమాండ్ నెలకొంది. ఆర్టీసీ సమ్మెను అదనంగా భావించి ప్రైవేట్ వాహన యజమానులు అడ్డగోలుగా చార్జీలు పెంచారు. ప్రయాణికులు చేసేది ఏం లేక వాహనదారులు అడిగినంత ఇచ్చి తమ రాకపోకలు కొనసాగించారు. ఆర్టీసీ సమ్మె కారణంగా అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడమే కాకుండా ఆర్థికంగా నష్టపోయారు. సమ్మె కొనసాగింపుతో ఆర్టీసీకి సైతం ఎనలేని నష్టం నెలకొంది.

# నిర్ణీత గడువులో పన్ను చెల్లిస్తే 5%రాయితీ

## మున్సిపల్ కమిషనర్ చికినే శశిధర్

**అమరచింత, ఏప్రిల్ 22, (నినాదం):**

ఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలోని గృహ, వాణిజ్య భవనాల యజమానులకు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రాపర్టీ ట్యాక్స్‌ను ముందస్తుగా చెల్లించే వారికి ప్రభుత్వం ప్రకటించిన "ఎర్లీ బర్డ్ ఏప్రిల్ 5% పన్ను రాయితీ" పథకం అమలులో ఉందని మునిసిపల్ కమిషనర్ చికినే శశిధర్ అన్నారు బుధవారం ఆయన ఆత్మకూరు మున్సిపాలిటీ కార్యాలయంలో ఆస్తిపన్నుపై రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఆస్తి పన్నుపై 5% రిబేట్ అంటే, నిర్ణీత గడువులోపు పన్ను చెల్లించిన పన్నుదారులకు ఇచ్చే తగ్గింపు. ఇది ప్రజలను సమయానికి పన్నులు చెల్లించేలా ప్రోత్సహించడానికి అమలు చేస్తారు.

5% రిబేట్ గురించి ముఖ్య వివరాలు: రిబేట్ శాతం:మొత్తం ఆస్తి పన్నుపై 5% తగ్గింపు ఇస్తారు.

సాధారణంగా ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో (ఉదా: ఏప్రిల్ 1 నుండి ఏప్రిల్ 30 వరకు) చెల్లించిన పన్నులపై ఈ రిబేట్ వర్తిస్తుంది. ఈ తేదీలు మునిసిపాలిటీ ఆదేశాలపై ఆధారపడి ఉంటాయి.అన్ని రకాల ఆస్తి యజమానులకు (వసతి గృహాలు, వాణిజ్య భవనాలు మొదలైనవి) వర్తిస్తుంది,కానీ గడువు లోపల పూర్తి పన్ను చెల్లించినవారికి మాత్రమే.మీరు చెల్లించాల్సిన మొత్తం పన్నులో 5% తగ్గించి చెల్లిస్తే సరిపోతుంది, లేదా కొన్నిసార్లు ఆన్‌లైన్/కౌంటర్ వద్ద చెల్లించినప్పుడు సిస్టమ్ ఆటోమేటిక్‌గా తగ్గింపు చూపిస్తుంది.పన్నుదారులకు ఆర్థికంగా కొంత ఉపశమనం.మునిసిపాలిటీకి ముందుగానే ఆదాయం రావడం.మీ ఆస్తి పన్ను ₹10,000 అయితే 5% రిబేట్ = ₹500 మీరు చెల్లించాల్సింది = ₹9,500 గడువులో చెల్లించిన వారికి మాత్రమే మాత్రమే ఏప్రిల్ నెలలోపు ప్రాపర్టీ ట్యాక్స్ పూర్తిగా చెల్లించిన వారికి 5% రాయితీ లభిస్తుంది. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకొని తమ పన్ను భారం తగ్గించుకోవాలని సూచించారు.ప్రజలు ఆన్‌లైన్ ద్వారా లేదా మున్సిపల్ కార్యాలయంలో నేరుగా పన్నులు చెల్లించవచ్చని తెలిపారు. చివరి నిమిషంలో రద్దీని నివారించేందుకు ముందుగానే చెల్లింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు.పట్టణ అభివృద్ధి, శుభ్రత, మౌలిక సదుపాయాల మెరుగుదలకు పన్నుల సకాల చెల్లింపు ఎంతో ముఖ్యమని, అందరూ సహకరించాలని కమిషనర్ కోరారు.

# ప్రభుత్వం దిగి రాకపోతే సమ్మెను ఉధృతం చేస్తాం

## ఆర్టీసీ జేఏసీ హెచ్చరిక

## మద్దతు తెలిపిన టిఆర్ఎస్వి జిల్లా కోఆర్డినేటర్, రాష్ట్ర నాయకులు కుర్వ పల్లయ్య






**గద్వాల ప్రతినిధి ఏప్రిల్ 22 (నినాదం)**

జోగులాంబ గద్వాల జిల్లాలో ఆర్టీసీ కార్మికులు సమ్మెను తీవ్రతరం చేశారు ఉదయము నుండే సుమారు 110 బస్సులను ఎక్కడికి అక్కడే ఆపేసి సమ్మెకు దిగి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలలో ఆర్టీసీ కార్మికుల యొక్క న్యాయమైన డిమాండ్లను అమలు చేస్తామని చెప్పి మోసం చేయడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నర సంవత్సరాలైతే కూడా ఒక్క హామీలు కూడా అమలు చేయకపోవడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వం దిగివచ్చి ఆర్టీసీ కార్మికుల హామీలు నెరవేర్చకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**మద్దతు తెలిపిన కురువపల్లయ్య**

ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే రేవంత్ రెడ్డి సర్కార్ పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ పక్షాన పెద్ద ఎత్తున సమ్మెకు మద్దతుగా నిలుస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ప్రజా ఫ్రంట్ నాయకులు ప్రభాకర్, పౌర హక్కులనేత సుభాన్ మరియు ఆర్టిసి జేఏసీ చైర్మన్ పరమేశ్వరయ్య, భాస్కర్, సురేష్ మరి పెద్ద ఎత్తున ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.



# భారీ వర్షాలకు అరటి తోట నేలమట్టం

**గద్వాల ప్రతినిధి ఏప్రిల్ 22 (నినాదం)**

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల పరిధిలోని మేడికొండ గ్రామంలో మంగళవారం రాత్రి భీకరమైన గాలులతో వడగండ్ల వాన కురవడంతో , కుమ్మరి తిమ్మప్ప అనే రైతు రెండు ఎకరాల అరటి తోట నేలమరం అయింది, ఈ రైతు దాదాపు అరటి తోటకు ఎనిమిది లక్షల పైగా పెట్టుబడి పెట్టడం జరిగింది,నిన్న రాత్రి కురిసిన వర్షానికి చేతికొచ్చిన పంట నేల పాలయింది అంటూ ఆవేదన చెందారు. ఇలాంటి ఘోరం ఎప్పుడు జరగలేదని రైతు లబోదిబో అని వాపోతున్నారు, ప్రభుత్వ పరంగా నన్ను ఆదుకోమని కుమ్మరి తిమ్మప్ప ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ర్యాంకుల గోలతో విద్యార్థులపై ఒత్తిడి!

**సంపాదకీయం**

టీవీలు, పేపర్ల నిండా ర్యాంకుల గోల. మా వద్ద చదివిన వారికి ర్యాంకులే ర్యాంకులు అంటూ... ప్రకటనలు..1,2,3 ఇలా టీవీల్లో ఊదరగొడుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే...ర్యాంకుల గొడవలో పిల్లల్లో సృజనాత్మకతను దెబ్బతీస్తున్నారు. లక్షల్లో ఫీజులు వసూళ్లు చేసి, పేద మధ్యత తరగతి వారిని మాయలో పడేస్తున్నారు. ఇంతపెద్ద దేశంలో ఇలాంటి చదువులు సాగుతున్నందుకు సిగ్గుపడాలి. ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా భ్రష్టు పడుతోంది. ప్రభుత్వ హాస్టళ్లు నానాటికి తీసికట్టుగా తయారవుతున్నాయి. విద్యార్థులకు సరైన తిండి దక్కడం లేదు. ఫుడ్ పాయిజనింగ్‌తో చస్తున్నారు. అయినా పెద్దగా చర్యలు తీసుకోవడం లేదు. నానా రకాల పేర్లతో హాస్టళ్లు పెట్టి పిల్లలను ఘోష పెడుతున్నారు. ఇక ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజలు కట్టుకోలేనంత, తట్టుకోలేనంతగా ఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలకు చీమకుట్టినట్లు కూడా లేదు. తల్లిదండ్రులు ధర్నాలు చేసినా, ఫీజలు భారం నుంచి తప్పించడం లేదు. జీవితమంటే చదువులు, మార్కులు, ర్యాంకులే అన్న విధంగా విద్యారంగం తయారయ్యింది. ప్రైవేట్ మాఫియాలో అసలు విద్య గంగలో కలసిపోతోంది. ర్యాకులే విజయానికి కొలమానాలుగా మారాయి. నేటి విద్యావిధానం మార్కులు, ర్యాంకుల చుట్టూనే తిరుగుతోంది. పిల్లల ప్రతిభను ఈ కొలమానంతో కొలవడం దారుణం. ర్యాంకుల వేటలో పిల్లల మానసిక ఒత్తిడిని పెంచుతున్నారు. ఇటీవలి కాలంలో విద్యార్థుల ఆత్మహత్యలు సామాజిక సమస్యగా మారింది. చదివేది, పరీక్షలు రాసేదీ విద్యార్థులైతే, వాటి ఫలితాల కోసం ఎదురు చూసేది, వారి భవితపై అంచనాలు పెంచుకునేది వారి తల్లిదండ్రులు. వారి ర్యాంకులతో వ్యాపారం చేసేది ఆయా విద్యాసంస్థలు. ఈ ఒత్తిళ్ల మధ్య చదువులు, ర్యాంకుల వాతావరణానికి తోడు రకరకాల ఆర్థిక, సామాజిక, వివక్షల వంటి అనేక కారణాలు విద్యార్థుల్లో విపరీతమైన మానసిక సమస్యలను సృష్టిస్తున్నాయి. తల్లిదండ్రుల అంచనాల ను, విద్యాసంస్థల ఒత్తిళ్లను తట్టుకోలేక కుంగుబాటుతో, నిస్సహాయతతో కొందరు బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. తాజాగా వచ్చిన ఇంటర్ ఫలితాల అనంతరం పదుల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. పరీక్షల్లో ఫెయిలైతే జీవితం ముగిసిపోయినట్లే అన్న భావనలో..ఆత్మహత్యలే శరణ్యమని భావిస్తున్నారు. జీవితంలో చదువు, కెరీర్ ఒక భాగం మాత్రమే. అని వారికి అవగాహన కల్పించడం లేదు. మంచిచెడుల విచక్షణను తెలియజెప్పడం లేదు. ఇంటర్ ఫలితాలు వచ్చాక ఇటీవల తెలంగాణలో ఒక్క రోజులోనే ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే, ఎపి లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. టెన్త్, ఇంటర్ ఫలితాలొచ్చిన ప్రతిసారీ చిన్నారుల ఆత్మహత్యల వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. కార్పొరేట్ విద్యా ఫ్యాక్టరీలు ర్యాంకుల కోసం విద్యార్థులను యంత్రాల్లా మార్చుతున్నాయి. పిల్లలపై తల్లిదండ్రుల అంచనాలకు హద్దు లేకుండా పోతోంది. వారి అంచనాలను అందుకోలేక మరొకరితో పోల్చడాన్ని తట్టుకోలేక.. బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇవి కేవలం పిల్లల వ్యక్తిగత వైఫల్యాల ఫలితం కాదు. సమాజం, విద్యావ్యవస్థలోని లోపాలను ప్రతిబింబిస్తోంది. సుప్రీంకోర్టు సైతం ఇది వ్యవస్థాగత లోపానికి నిదర్శనం అని వ్యాఖ్యానించిందంటే.. పరిస్థితి తీవ్రత ఎంతగా వుందో అర్థం చేసుకోవచ్చు. పరీక్షల ఒత్తిడిలో వున్న పిల్లలకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. వారికి మానసిక స్థైర్యాన్ని ఇవ్వడం ముఖ్యం. మార్కులు, ర్యాంకుల కోసమే పుట్టలేదన్న విషయం పిల్లల్లో నూరిపోయాలి. ఫెయిలైతే మళ్లీ చదువుకునేందుకు అవకాశం ఉంది. అసలు చదువే ఇష్టం లేకపోతే అభిరుచి వున్న మరో రంగంలో సత్తా చాటడానికి విశాల ప్రపంచం ఉంది. తరగతి గదిలో వెనకబడిన వారు జీవితంలో అద్భుతాలు సాధించిన ఘటనలు అనేకం చరిత్రలో వున్నాయి. సచిన్ టెండూల్కర్, ధోనీ వంటి ప్రముఖ క్రికెటర్లు హైస్కూల్ చదువులతోనే సరిపెట్టుకున్నారు. ఇప్పుడు పేరున్న వారంతా అభిరుచి కలిగిన రంగంలో స్వయంకృషితో ఎదిగినవారే. ఇంటర్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయనో, పదిలో ఫెయిల్ అయ్యామనో తనువు చాలిస్తే భవిష్యత్‌లో దేశం ఒక గొప్పవ్యక్తిని కోల్పోయినట్టే. మన శ్రమతో కొత్త చరిత్రను లిఖించాలి. ఇవన్నీ ఒక ఎత్తయితే విద్యారంగంలో సంస్కరణలు ముఖ్యం. ర్యాంకుల గోల, ఫీజలు గోల పోయేలా ప్రభుత్వరంగంలో స్కూళ్లను, కాలేజీలను బలోపేతం చేయాలి. ఒకేతరహా విద్య అందరికీ అందేలా చేయాలి. ముఖ్యమంగా ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలి. లక్షల్లో ఫీజులు వసూళ్ల దందాను ఆపాలి. అలాగే ర్యాంకుల చదవులను ఆపాలి. పలు తరహాల సిలబస్‌లకు బ్రేక్ వేయాలి. ప్రధానంగా ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేసి, టీచర్లను నియమిస్తే..పేదలు కార్పొరేట్ స్కూళ్ల మోజులో పడరు. వాటి వెనకాల పరుగెత్తరు. ఇది గుర్తించి ఉమ్మడి ఏపిలో ప్రభుత్వాలు చర్యలకు ఉపక్రమించాలి.

# సీజ్ ఫైర్ పొడిగింపు




**కాల్పుల విరమణ పొడిగించిన ట్రంప్**
**స్పష్టమైన ప్రతిపాదనతో రావాలని ఇరాన్‌కు సూచన**
**ట్రూత్ సోషల్ మీడియాలో వెల్లడించిన అధ్యక్షుడు**



**వాషింగ్టన్, నినాదం:**

ఇరాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇరుదేశాల మధ్య గతంలో కుదిరిన కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్ నాయకత్వం ఒక సమగ్ర ప్రతిపాదనను సమర్పించే వరకు ఈ కాల్పుల విరమణ కొనసాగుతుందని తెలిపారు. అమెరికా, ఇరాన్ మధ్య ఈ నెల 8వ తేదీన కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. రెండు వారాల ఈ సీజ్ ఫైర్ మరో కొద్ది గంటల్లో ముగియనుందనగా ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, పాకిస్థాన్ నుంచి వచ్చిన అభ్యర్థన మేరకే కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించినట్లుగా ట్రంప్ తెలిపారు. ముఖ్యంగా పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ల అభ్యర్థన మేరకు సైనిక చర్యను వాయిదా వేసి, దౌత్య చర్చలకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లుగా పేర్కొన్నారు. ఈ మేరకు తన ట్రూత్ సోషల్ ఖాతా ద్వారా వివరాలను వెల్లడించారు. అయితే, సీజ్‌ఫైర్ కొనసాగుతున్న సమయంలోనే ఇరాన్‌పై సముద్ర దిగ్బంధనాన్ని కొనసాగించాలని సైన్యానికి ఆదేశాలు ఇచ్చినట్లుగా ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు తీవ్రంగా ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో వారు ఏకీక త ప్రతిపాదనతో రావడానికి సమయం అవసరం. అందుకే ఈ దాడిని నిలిపివేసి, సీజ్‌ఫైర్ పొడిగించాం అని తెలిపారు. బ్లాకేడ్ కొనసాగించాలని ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై ఇరాన్ మండిపడింది. ఇది కాల్పుల విరమణకు వ్యతిరేకమని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అర్ఘాచీ విమర్శించారు. వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడమంటే యుద్ధ చర్యే అని సమానమని అన్నారు. తమ ప్రయోజనాలను రక్షించుకోవడం ఇరాన్‌కు తెలుసని స్పష్టం చేశారు. ఇక పాక్‌లో జరగాల్సిన చర్చలకు హాజరుకాకూడదని ఇరాన్ నిర్ణయించుకున్నట్లుగా టస్నీమ్ వార్త సంస్థ వెల్లడించింది. అమెరికా అతిగా డిమాండ్లు చేస్తుందని.. అవి ఒప్పందానికి అడ్డుగా మారుతున్నాయి కాబట్టి చర్చల్లో పాల్గొనడం వ్యర్థమని అభిప్రాయపడుతున్నట్లుగా పేర్కొంది. ఇదిలావుంటే ఇరాన్‌తో ప్రస్తుతం కొనసాగుతున్న కాల్పుల విరమణ ఒప్పందంపై అమెరికా ఒక హెచ్చరిక జారీ చేసింది. ఈ కాల్పుల విరమణ అనేది 'అపరిమిత కాలం' కోసం కాదని, ఇరాన్ తన బాధ్యతలను నెరవేర్చడానికి ఒక నిర్దిష్ట సమయం మాత్రమే కేటాయించామని అమెరికా ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు. ఈ అంశం గురించి సదరు అధికారి 'యాక్సియోస' పత్రికతో మాట్లాడుతూ, ఇరాన్ నిబంధనలను పాటించకపోతే ప్రస్తుతం ఉన్న కాల్పుల విరమణను ఎప్పుడైనా రద్దు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉద్రిక్తతలను తగ్గించడానికి ఇరాన్‌కు ఒక అవకాశం ఇచ్చామని, అయితే దీనిని ఆ దేశం బలహీనతగా భావించకూడదన్నారు. అణ్వాయుధ కార్యక్రమాలు, ప్రాంతీయ ఉగ్రవాద సంస్థలకు మద్దతు లేదా ఇతర దౌత్య పరమైన అంశాలపై ఇరాన్ నుంచి ఆశించిన మార్పులు రాకపోతే తదుపరి చర్యలు ఉంటాయని తేల్చిచెప్పారు. పశ్చిమాసియాలో నెలకొన్న అస్థిరతను అరికట్టడానికి అంతర్జాతీయ సమాజం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అయితే, ఇరాన్ తన ప్రాక్సీ గ్రూపుల ద్వారా లేదా నేరుగా వివాదాల్లో జోక్యం చేసుకుంటే సహించేది లేదని అమెరికా పదేపదే చెబుతోంది.

### ఆర్థికంగా కుదేలవుతున్న ఇరాన్

ఇరాన్ ఆర్థికంగా కుదేలవుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇరాన్ ఆదాయం పడిపోతున్నట్లు ఆచయన చెప్పారు. హోర్ముజ్‌ను తక్షణమే ఓపెన్ చేయాలని ఇరాన్ భావిస్తున్నదని, ఎందుకంటే వాళ్లకు నగదు కొరత ఏర్పడిందన్నారు. ప్రతి రోజూ ఆ దేశం సుమారు 500 మిలియన్ల డాలర్లు నష్టపోతున్నదని ట్రంప్ తెలిపారు. మిలిటరీకి, పోలీసులకు జీతాలు అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. హోర్ముజ్‌ను మూసిన ఇరాన్ ఆ పరిస్థితి నుంచి బయటపడేందుకు ఇబ్బందిపడుతున్నట్లు ఆయన తెలిపారు. జలసంధిని బ్లాకేడ్ చేసినట్లు తాము చెప్పడం వల్లే ఇరాన్ దాన్ని మూయాలని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. వాస్తవానికి నాలుగు రోజుల క్రితం తన వద్దకు కొందరు వచ్చి హోర్ముజ్‌ను ఓపెన్ చేయాలని కోరారని, కానీ ఒకవేళ హోర్ముజ్‌ను తాము ఓపెన్ చేస్తే, అప్పుడు ఇరాన్‌తో డీల్ కుదుర్చుకోలేమన్నారు. ఒకవేళ ఆ దేశాన్ని మొత్తం పేల్చివేస్తే తప్ప మళ్లీ ఆ డీల్ కుదిరే అవకాశం ఉండదని ట్రంప్ అన్నారు.

### జెడి వాన్స్ ఇస్లామాబాద్ పర్యటన రద్దు

ఇరాన్‌తో సీజ్‌ఫైర్‌ను పొడిగిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో జరగాల్సిన శాంతి చర్చలు రద్దు అయ్యాయి. ఇక అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా తన పాక్ పర్యటన రద్దు చేసుకున్నట్లు వైట్‌హౌజ్ ధ్రువీకరించింది. ఈనెలలో రెండోసారి జేడీ వాన్స్ పాక్‌లో పర్యటించాల్సి ఉంది. ఇరానీ ప్రతినిధులతో ఓ డీల్ కుదుర్చుకునేందుకు ఆ ట్రిప్ జరగాల్సి ఉంది. కానీ కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడంతో వాన్స్ జర్నీ నిలిపివేశారు. అయితే ఒకవేళ వ్యక్తిగత సమావేశాలు ఏమైనా ఉంటే దానిపై ప్రకటన చేస్తామని వైట్‌హౌజ్ అధికారులు చెప్పారు. ఇరాన్‌తో సీజ్‌ఫైర్ను నిరవధికంగా పొడిగించడం పట్ల ట్రంప్‌కు థ్యాంక్స్ చెప్పారు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్. మా రిక్వెస్ట్‌ను ఆమోదించి సీజ్‌ఫైర్ ప్రకటించడం సంతోషకరమని, దీని వల్ల దౌత్యపరమైన ప్రయత్నాలు కొనసాగుతుంటాయని అన్నారు. పాకిస్థాన్‌పై విశ్వాసాన్ని, నమ్మకాన్ని ప్రదర్శించారని, ఇరాన్‌తో సమస్యను పరిష్కరించేందుకు దౌత్యపరంగా తమ ప్రయత్నాన్ని వీడబోమన్నారు. ఇరు దేశాలుసీజ్‌ఫైర్ను కొనసాగిస్తూ సమగ్రమైన శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకుంటాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ కూడా ట్రంప్ నిర్ణయాన్ని స్వాగతించారు. ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఇది కీలకమైన అడుగు అని, దీని ద్వార దౌత్యం నిర్వహించేందుకు మార్గం సులువు అవుతుందని, అమెరికా`ఇరాన్

# సైబర్ నేరాలు పెరుగుతున్నయ్

**బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల ప్రక్షాళన అవసరం**
**ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రాకు సిపి సజ్జన్నార్ లేఖ**

హైదరాబాద్ : సైబర్ నేరాలను అరికట్టాలంటే బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల ప్రక్షాళన అవసరమని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. సైబర్ ముఠాలకు 'మ్యూల్ అకౌంట్లు' వరంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నగర పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ ఆక్టోపస' దర్యాప్తులో వెలుగుచూసిన అంశాల ఆధారంగా బ్యాంకింగ్ వ్యవస్థలోని లోపాలను వివరిస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రాకు లేఖ రాశారు. ఖాతాల ప్రారంభంలో కేవైసీ ధ్రువీకరణలో జరుగుతున్న నిర్లక్ష్యం ప్రధాన సమస్యగా ఉందని సీపీ పేర్కొన్నారు. బ్రాంచ్ స్థాయి అధికారులపై జవాబుదారీతనం నిర్ధారిస్తూ అన్ని వాణిజ్య బ్యాంకులకు కఠిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఆర్బీఐ మార్గదర్శకాల అమలుపై తక్షణమే సిస్టమిక్ ఆడిట్ నిర్వహించాలని సూచించారు. ప్రజల సొమ్మును కాపాడాల్సిన కొంతమంది బ్యాంకు అధికారులే సైబర్ నేరగాళ్లతో కుమ్మక్కవుతున్నారని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లో జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ కేవైసీ వెరిఫికేషన్‌లో జరిగిన లోపాలు భద్రతా వైఫల్యానికి నిదర్శనమని తెలిపారు. సైబర్ నేరాలకు సహకరించిన బ్యాంకు అధికారులను గుర్తించి ఆర్బీఐకి నివేదించి వారిని శాశ్వత బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలని సూచించారు. మ్యూల్ అకౌంట్లపై నిరంతర పర్యవేక్షణ కోసం ఆర్బీఐ,



బ్యాంకులు, పోలీసులతో కూడిన జాయింట్ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. వాట్సాప్, టెలిగ్రామ్ వంటి వేదికల్లో వచ్చే అధిక లాభాల ప్రకటనలను నమ్మవద్దని, 'డిజిటల్ అరెస్ట్' పేరిట వచ్చే బెదిరింపులకు భయపడవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే 'గో `డలెన్ అవర'లో 1930 నంబర్‌కు కాల్ చేయాలని లేదా అధికారిక వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ సూచించారు.

# ఉనికి కోసం సగరుల భగీరథ ప్రయత్నం

**గతమెంతో ఘనం...ఎందుకంటే షట్ చక్రవర్తులలో ఒకరైన సగర చక్రవర్తి వారసులు వారు...వర్తమానం అగమ్యగోచరం... భగీరథుడి వంశస్తులైన వారు దశాబ్దాలుగా ఉనికి లేని ఉప్పరులుగా కొనసాగిన తీరు....భవిష్యత్తు ఆశాజనకం... ఇప్పుడిప్పుడే వస్తున్న అన్ని అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థిక సామాజిక,రాజకీయ రంగాల్లో తమకంటూ ఒక గుర్తింపు సాధిస్తూ ఒక్కొక్క అడుగు ముందుకేస్తున్న నేపథ్యం...మొత్తంగా ఇదీ సగర జాతి ప్రస్థానం.**
**సగరుల జీవన ప్రయాణం ఆ సముద్రుడితో ముడి పడి ఉంటుంది. ఆ సాగరాన్ని నమ్ముకొని ఉప్పు తయారీదారులుగా వాసికెక్కి ఉప్పరులుగా పిలవబడే సగరుల జీవితాలు శతాబ్దాలుగా సముద్రంలో అలల మాదిరిగా ఒకడుగు ముందుకు. రెండడుగులు వెనక్కి అన్న తీరుగా సాగుతూ వచ్చాయి.**



కొన్ని దశాబ్దాల క్రితం వరకు ప్రభుత్వ రికార్డుల్లో తప్ప బయటకి పరిచయం లేని ఒక వెనుకబడిన కులం గా ఉన్న ఉప్పర కులం రిజర్వేషన్లలో మాత్రం అగ్రకులాలకు ఏమాత్రం తీసుపోకుండా ఇప్పటికీ బి సి డి గ్రూప్ లో ఉంటూ ఉనికి చాటుకుంది.ఉప్పు తయారీ దారులుగా, కాల క్రమేణా నిర్మాణ రంగ కార్మికులుగా కొనసాగుతున్న ఈ సగర జాతి కులగురువైన భగీరథుడి జయంతి సందర్భంగా ఆయన చరిత్రను ఒకసారి పరిశీలించి చూస్తే... పురాణాల ఆధారంగా షట్ చక్రవర్తులలో ఒకరైన సగర చక్రవర్తి హరిశ్చంద్ర వంశంలో ఎనిమిదోతరం వాడు. సగరుడికి పుట్టినవారు అసమంజనుడు అతని వారసుడు అంశు మంతుడు, ఆయన కుమారుడు దిలీపుడు, దిలీపుడి కుమారుడే భగీరథుడు. ప్రతి ఏటా వైశాఖ శుద్ధ సప్తమి రోజు ఆయన జయంతిని యావత్ భారతావని జరుపుకుంటుంది. అయితే నగరుడు అయోధ్యనగరానికి రాజుగా కొనసాగుతూ సమస్త రాజ్యాలను జయించి చక్రవర్తి అయ్యాడు. ప్రజల సంక్షేమం కోసం వశిష్ట మహాముని అజ్ఞానుసారం అశ్వమేథ యాగానికి సంకల్పించి యాగాశ్వం వెంట తన సంతానమైన అరవైవేల కుమారులను పంపుతాడు. అయితే ఇంద్రుడు ఈ అశ్వాన్ని తస్కరించి పాతాళలోకంలో తపస్సు చేస్తున్న కపిల మహర్షి చెంత దానిని కట్టివేయగా వెతుకుతూ వెళ్లిన సగర కుమారులు సమస్త భూ మండలాన్ని గాలించే సమయంలో భూమిని ఏడుపాయలుగా తవ్వినట్లు చరిత్ర చెబుతోంది. చివరికి పాతాళంలో కపిల మహర్షి చెంత ఉన్న అశ్వాన్ని చూసి కావాలనే తమ అశ్వాన్ని కట్టి పడేశాడనుకొని అతనితో వాదనకు దిగి చివరికి అతని శాపానికి లోనై భస్మీపటలం గావించబడుతారు. అనంతరం అంశు మంతుడు, భగీరథుడి తండ్రి అయిన దిలీపుడు ఆ అరవై వేల సగరుల జాడ కోసం ప్రయత్నించి విఫలనువుతారు. అయితే తమ ముత్తాతలు భస్మం కాబడ్డ విషయాన్ని తెలుసుకున్న భగీరధుడు వారి కోసం కైలాస గంగను సాదించడానికి హిమవత్ పర్వతాలలో ఉన్న గోకరమునకు చేరి ఏకాగ్రతతో ఏకపాదంపై ఆరువేల సంవత్సరాలు ఘోర తపస్సు చేసినట్లు చరిత్ర చెపుతోంది. దీంతో శివుడు ప్రత్యక్షమై గంగను భూమిపైకి పంపడానికి అనుమతినిచ్చి తన జటాజూటంలో గంగను నింపుకుని కొంచెం కొంచెంగా దార వదులగా బిందు సరోవరం నుండి నాడు సగర పుత్రులు తవ్విన ఏడు పాయలలో గంగ ప్రవహించినది. మాలిని, పావని, నలిని అనే మూడు పాయలు తూర్పు ముఖంగా సండిక్షువు, సీత, సింధు అనే మూడు పాయలు పడమటి వైపు ప్రవహించగా గంగా మాత్రం భగీరథున్ని అనుకరించి ప్రవహించింది.

తన ముత్తాతల భస్మీపటలంపై పారిన గంగతో వారు విముక్తి పొందినట్లు చరిత్ర చెపుతోంది అకుంఠిత దీక్షతో నాడు గంగను తెచ్చి చరిత్రలో నిలిచిన భగీరథుడి ఆనంతరం అతని వారసులుగా కకుక్షడు, రఘువు, ప్రవృద్ధుడు, శంఖనుడు, సుదర్శనుడు, తీగ్రవర్ణుడు, యయాతి, భాగుడు, అజమహారాజు, ఆయన కుమారుడే దశరథ మహారాజు, అతని కుమారులే శ్రీరామ లక్ష్మణ భరత శత్రజ్ఞులు, ఇలా రఘు వంశస్తులైన సగరులు గతంలో రాజులు, చక్రవర్తులు అనేది చరిత్ర చెబుతున్నా కఠోర వాస్తవం. ఇది గతం. ఇక వర్తమానం విషయానికి వస్తే నాడు దివి నుండి భువికి గంగను తెచ్చిన భగీరథుడు వంశస్తులు కలియుగంలో సముద్రుని నమ్ముకొని ఉప్పు తయారీదారులుగా జీవనం సాగించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. అనేక రాష్ట్రాల్లో ఇప్పటికీ సాల్ట్ మేకర్స్ అసోసియేషన్ సభ్యులుగా సగరులే ఉండటం గమనించదగ్గ విషయం. తెలుగు ప్రజల విషయానికి ప్రధానంగా తెలంగాణ ప్రాంతానికి వచ్చేసరికి,ఇప్పటికీ పలు చోట్ల చెరువుల వద్ద నీరటితనం చేస్తూ, పంట పొలాలకు సమాన నిష్పత్తిలో నీరు వదిలే బాధ్యతను సగరులే నిర్వహిస్తున్నారు.దీంతో పాటు ప్రధానంగా ఇక్కడ నగరులు నిర్మాణ రంగాన్ని కులవృత్తిగా చేసుకుని జీవనం సాగిస్తున్నారు.

బొంబాయి. బొగ్గు బాయి, భిలాయి ఛత్తీస్ ఘడ్ ఇలా ఒక్కటేంటి అనేక ప్రాంతాల్లో నిర్మాణరంగ పనులకోసం గుంపులు కట్టుకొని వలస వెళ్లిన ఉదంతాలు ఎన్నో ఎన్నెన్నో. చెరువులు తవ్వటం, కాలువలు తవ్వటం,ప్రాజెక్టులు కట్టడం ఇలా ఒక్కటెంటి కష్టాన్ని నమ్ముకొని మట్టి జీవులుగా బతుకు బండిని లాగుతున్న సగరులు పాలకుల దృష్టి లో మాత్రం అప్పట్లో బడా కాంట్రాక్టర్ లుగా గుర్తించబడ్డారు కాబోలు అందుకే బి.సి. రిజర్వేషన్ లలో దాదాపు ఉన్నత కులాల సరసన బి.సి డి గా గుర్తించబడ్డారు. మురళీధరన్, అనంతరామన్ లాంటి అనేక కమిషన్లు సగరుల జీవనస్థితిగతులను వారి ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేసి వీరిని బీసీ ఏ లో చేర్చాలని సిఫారసు చేసిన ఇప్పటి వరకు అది కార్యరూపం దాల్చలేదు. గత కే సి ఆర్ ప్రభుత్వం భగీరథుడు గంగను భూమ్మీదికి తీసుకొచ్చాడని గుర్తించి ఇంటింటికి తాగు నీరు అందించే రక్షిత నీటి పథకానికి భగీరధుడి పేరు పెట్టడం పట్ల యావత్ నగర జాతి సంతోషించింది. దాంతోపాటు కొన్ని జి ఓ లు తీసుకొచ్చి భవన నిర్మాణ పనుల్లో ధరావతు లేకుండా కొంత శాతం పనుల్లో రిజర్వేషన్ కల్పించే విధంగా చర్యలు తీసుకోవడం, ఆత్మగౌరవ భవనాల పేరిట కోకాపేటలో సగరులకు రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించడం అభినందనీయం.

ఇక భవిష్యత్తు విషయానికి వస్తే రాష్ట్రంలో దాదాపు 7 లక్షల పైగా నగర జనాభా ఉండగా ఈ మధ్య తెలంగాణ ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన బీసీ జనగణన గణాంకాలు సగరులను ఆశ్చర్యానికి గురిచేసాయి. కేవలం ఒక్క ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోనే దాదాపు రెండున్నర లక్షలకు పైగా సగర జనాభా ఉండగా తెలంగాణ రాష్ట్రమంతా ఒక లక్షా ఇరవై నాలుగువేల జనాభా మాత్రమే ఉందని ప్రకటించడం పట్ల ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడిప్పుడే అంది వస్తున్న అవకాశాలను స్వీకరిస్తూ ముందుకు సాగుతూ ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా ఎదగడానికి తమ కులగురువైన భగీరథుడి స్ఫూర్తితో ప్రయత్నం చేస్తుంటే మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్లు ప్రస్తుత పాలకులు తమ జనాభాను కేవలం (0.03 శాతం) గా చూపడాన్ని సగరులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ మధ్యనే జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అనేకచోట్ల సర్పంచులుగా, కౌన్సిలర్లుగా, కార్పొరేటర్లుగా గెలిచి పురోగమన దిశగా ప్రయాణిస్తున్న ఇలాంటి బి.సి.కులాల పట్ల తప్పుడు లెక్కలు చెప్పి వారికి అవకాశాలు కల్పించకపోతే ఇలాంటి కులాలు అభివృద్ధి చెందడానికి దశాబ్దాలు కాదు మళ్ళీ శతాబ్దాలు పడతాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాగూ కులగణన చేయడం లేదని భావించి మూడేళ్ల క్రితమే తెలంగాణ రాష్ట్ర సగర సంఘం ఆధ్వర్యంలో నగర జనాభా గుర్తించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగింది. కానీ తదనంతరం ప్రస్తుత ప్రభుత్వం కులగనన చేసినప్పటికీ అది పారదర్శకంగా జరగలేదని భావించినట్లే ఈ మధ్య కాలంలో వెల్లడించిన గణాంకాలు రుజువుచేశాయి.ఈ జనాభా లెక్కలను రేపు కేంద్ర ప్రభుత్వం చేసే జనగణన లో లెక్కల్లోకి తీసుకుంటే ఇలాంటి కులాలు నష్టపోయే అవకాశాలు ఉన్నాయి.

భవిష్యత్తులో చట్ట ప్రకారం బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించినట్లయితే తెలంగాణ బాంటి రాష్ట్రాల్లో ఉన్న 132 బీసీ కులాలకు ఎంతో కొంత న్యాయం దక్కే అవకాశాలు లేకపోలేదు. సమస్త జీవకోటికి ప్రాణాధారమైన జలధారను తేవడంలో కృతకృత్యుడైన భగీరథుడి వారసులుగా జీవనం సాగిస్తున్న సగరుల జనాభా గురించి తక్కువ చేసి చూపిన ఈ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సరి చేసుకొని వాస్తవాలు వెల్లడించాలి. అలా చేసినప్పుడే ఇప్పుడిప్పుడే ముందుకు సాగుతున్న ఇలాంటి కులాలు అన్ని రంగాల్లో సమాన వాటాకు ఒక పక్క ప్రయత్నిస్తూనే స్వావలంబన దిశగా అడుగులు వేయగలవనే నిజాన్ని గుర్తెరగాలి. ప్రభుత్వం సగర కుల గురువైన భగీరథుడి జయంతి ఉత్సవాలు అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాలతో పాటు ఈ నెల 23వ తేదీన గురువారం హైదరాబాద్ కేంద్రంగా రవీంద్ర భారతి లో ఘనంగా నిర్వహించనుంది.

**(నేడు భగీరథ జయంతి)**

**ఆస్కాని మారుతి సాగర్**
**చైర్మన్, తెలంగాణ సగర భగీరథ ఆత్మగౌరవ భవన ట్రస్ట్**
**9010756666**



# మాజీ సిఎం నాదెండ్ల భాస్కరరావు మృతి

**చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన నేత**
**మంత్రి కందుల దుర్గేశ్ తది తరుల సంతాపం**

హైదరాబాద్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు (90) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భాస్కర్ రావు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. 1935 జూన్ 23న గుంటూరులో జన్మించిన నాదెండ్ల భాస్కర్ రావు 1978లో విజయవాడ ఈస్ట్ నుంచి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1978 నుంచి 1989 వరకు ఎమ్మెల్యేగా కొనసాగారు. 1986 ఆగస్ట్ 16 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను పదవీచ్యుతిడిని చేసిన నాదెండ్ల నెలరోజులపాటు సిఎంగా కొనసాగారు. నాదెండ్ల భాస్కర్ రావు మృతిపట్ల సినీ, రాజకీయ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నాదెండ్ల భాస్కర్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ సంతాపం తెలియజేశారు. నాదెండ్ల భాస్కర్ రావు కుమారుడు నాదెండ్ల మనోహర్ ప్రస్తుతం జనసేన పార్టీ తరపున ఏపీ మంత్రిగా సేవలందిస్తున్నారని తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నాదెండ్ల భాస్కర రావు(90) కన్నుమూశారు. గత నెల రోజులుగా నాదెండ్ల భాస్కరావు మతి పట్ల మంత్రి కందుల దుర్గేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'భాస్కరరావు మ్రుతి రాజకీయ రంగానికి తీరని లోటు. ఎంతోమంది నేతలకు రాజకీయ ఓనమాలు నేర్పిన గొప్ప మార్గదర్శి నాదెండ్ల భాస్కర్ రావు. ప్రజా ప్రతినిధిగా భాస్కరరావు చేసిన సేవలు చిరస్మరణీయం. 1980వ దశకంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంలో ఆయన కీలక పాత్ర పోషించారు. స్వల్పకాలం ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటికీ, అంతకుముందు మంత్రిగా ఆయనకు పరిపాలనపై గట్టి పట్టు ఉండేది. చట్టసభల పనితీరుపై ఆయనకు అపారమైన అవగాహన ఉంది. గుంటూరు జిల్లా నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో తనదైన ముద్ర వేశారు' అని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు.

# ముంజలోయ్.. తాటి ముంజలు..





ఎండల నుంచి ఉపశమనం
ముంజల్లో ఎన్నో పోషకాలు
రుచితో పాటు ఆరోగ్యకరం
ప్రకృతి ప్రసాదించిన వరం

వేసవి వేడి నుంచి ఉపశమనం పొందేందుకు తాటి ముంజలు భలే పనిచేస్తాయి. తాటి ముంజలు అంటే ఇష్టపడని వారంటూ ఉండరు. తాటికల్లు తాగని వారు కూడా ముంజలు తింటారు. ప్రస్తుత సీజన్ లో లభించే వీటిని చాలామంది ఇష్టపడతారు. మామిడి, అరటి, ద్రాక్ష, నారింజ ఇలా ఏ పండ్లు తీసుకున్న వాటిపై రసాయనాల ప్రభావం ఎంతో కొంత ఉంటుంది. కానీ అసలు రసాయనాల ప్రభావం లేనివి మండు వేసవిలో అందరూ ఇష్టపడే తాటి ముంజలు వీటిని ఇష్టపడని వారుండరంటే అతిశయోక్తి కాదు.

జయశంకర్
భూపాలపల్లి బ్యూరో (నినాదం);

ఒకప్పుడు కేవలం పల్లెలకే పరిమితమైన ఇవి ఇప్పుడు గ్రామాలు, నగరవాసుల ముంగిట్లో వచ్చేస్తున్నాయి. ఎండాకాలంలో అందరి దృష్టిని ఆకర్షించే తాటిముంజలు అనేక లాభాలున్నాయి. మండే ఎండల్లో తాటి ముంజలు తింటే ఆ మజాయే వేరు శరీరానికి చల్లదనం కాదు కీలకమైన పోషకాలు కూడా అందుతాయి. పలు ఆరోగ్య సమస్యలు కూడా దూరమవుతాయి. ఇవి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో విరివిగా లభిస్తున్నాయి. గ్రామాల నుంచి చాలామంది పట్టణ ప్రాంతాలకు వచ్చి వీటిని అమ్ముతు ఉపాధి పొందుతున్నారు.

**పోషకాలు పుష్కలం..!**

ప్రకృతి సిద్ధంగా లభించే తాటి ముంజలు ఇప్పుడు గ్రామాల్లోని ప్రజల దాహార్తిని తీర్చడంతో పాటు శరీరానికి కావలసిన పోషకాలను అందిస్తున్నాయి. వీటిలో విటమిన్లు అధికంగా లభిస్తాయి. సెల్యూలోజ్ అధికంగా ఉంటుంది. ఇది ఆహారం త్వరగా జీర్ణమయ్యేందుకు ఎంత గానో తోడ్పడుతుంది. శరీరానికి అవసరమైన విటమిన్ ఏ, బి, సి, ఐరన్, జింక్, పొటాషి యం లాంటి ఖనిజ లవణాలు కూడా పుష్కలంగా ఉంటాయి. ఎండాకాలంలో అధిక ఉష్ణోగ్రత వల్ల



శరీరంలో నీరు ఎక్కువగా ఖర్చవుతుంది. దీంతో డీహైడ్రేషన్ బారిన పడతారు. అలాంటి పరిస్థితుల్లో తాటి ముంజలను తీసుకుంటే శరీరంలోకి చేరి డీహైడ్రేషన్ బారి నుంచి తప్పించుకోవచ్చు. దీంతో జీర్ణ సంబంధిత సమస్యలు తొలగిపోతాయి. అసిడిటీ, మలబద్ధకం నుంచి ఉపశమనం లభిస్తుంది. అరటిపండులో పొటాషియం ఎంత మొత్తంలో ఉంటుందో అదే స్థాయిలో ఇందులో ఉంటుంది. ఎండల కారణంగా వాంతులు, విరేచనాలు బారిన పడే వారికి తాటి ముంజలు తినిపిస్తే ఆ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.

**శక్తినిచ్చే తాటిముంజలు..!**

వీటిని తింటే శక్తినివ్వడమే గాక యాక్టివ్గా ఉంటారు. ముఖ్యంగా చిన్నపిల్లలు వృద్ధులకు ఇవి ఎంతో మేలు చేస్తాయి. రొమ్ము క్యాన్సర్తో పాటు ఇతర అంశాలను కూడా అడ్డుకునే గుణాలు తాటి ముంజుల్లో ఉన్నాయి. గుండె సమస్యలు, అధిక బరువు, షుగర్ ఉన్నవారు నిరభ్యంతరంగా తీసుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. శరీరం వేడిగా ఉండే వ్యక్తులు వేసవిలో తాటి ముంజలు తింటే మంచి ఫలితం ఉంటుంది. ఇది శరీర బరువును అదుపులో ఉంచుతాయి. పొటాషియం, గుండె ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుంది. రక్తపోటు అదుపులో ఉంటుంది. రక్తప్రసరణ సక్రమంగా సాగుతుంది. శరీరంలో చెడు కొలస్ట్రాల్ బయటకు పోయి మంచి కొలెస్ట్రాల్ వృద్ధి చెందుతుంది. అధిక బరువును నియంత్రిస్తుంది. తాటి ముంజలు పొటాషియం శరీరంలోని విషతుల్యతను బయటకు పంపుతుంది. దీంతో అంతర్గతంగా శరీరంలో అంతర్గతంగా శుభ్రం అవుతుంది.

# అవకాడో 14 రోజులు తిన్నారంటే..!

**అవకాడోలో కరిగే, కరగని ఫైబర్ రెండూ ఉంటాయి. ఇది పేగుల కదలికను సులభతరం చేసి కడుపును క్లీన్ చేస్తుంది. కేవలం 14 రోజుల్లోనే మీరు గ్యాస్, బ్లోటింగ్ (కడుపు ఉబ్బరం) నుండి ఉపశమనం పొందుతారని డాక్టర్ సేథి పేర్కొన్నారు. ఇది ఒక ప్రీబయోటిక్ ఆహారంగా పనిచేసి మీ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మెదడు పనితీరు పేగు ఆరోగ్యానికి, మెదడుకు దగ్గరి సంబంధం ఉంటుంది. అవకాడోలో ఉండే ఒలేయిక్ యాసిడ్ మెదడు కణాలను రక్షించడమే కాకుండా, ఏకాగ్రతను మానసిక ప్రశాంతతను పెంచుతుంది. జ్ఞాపకశక్తి తగ్గుతున్న వారు దీనిని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.**



కొలెస్ట్రాల్,
**రక్తపోటు:**
అవకాడోలో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. అలాగే, ఇది శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ను (రాణా) తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ను పెంచడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. అల్పాహారంగా అవకాడో తినడం వల్ల రోజంతా కడుపు నిండుగా ఉంటుంది.

**గుండె ఆరోగ్యానికి:**
14 రోజుల పాటు అవకాడోలు తినడం వల్ల మీ గుండెకు నేరుగా మేలు జరుగుతుందని డాక్టర్ సౌరభ్ సేథి వివరిస్తున్నారు. అవకాడోలలో మోనోఅన్శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇది గుండెకు నేరుగా మేలు చేసే ఒక రకమైన ఆహార కొవ్వు. ఇది బరువు తగ్గడానికి, కొలెస్ట్రాల్ను తగ్గించడానికి, రక్తనాళాలను విస్తరించడానికి సహాయపడుతుంది.

**ఎనర్జీ, బరువు నియంత్రణ:**
ఇందులోని ఆరోగ్యకరమైన కొవ్వులు మీకు ఎక్కువ సేపు ఆకలి వేయకుండా చూస్తాయి. దీనివల్ల మీరు అనవసరమైన చిరుతిళ్లు తినకుండా ఉండి, బరువు తగ్గడానికి సులభమవుతుంది. 14 రోజుల తర్వాత మీ ఎనర్జీ లెవల్స్ మునుపటి కంటే మెరుగ్గా ఉంటాయని డాక్టర్ వివరించారు.

అవకాడోను కేవలం ఒక పండుగా కాకుండా, ఒక సూపర్ ఫుడ్గా పరిగణించవచ్చు. డాక్టర్ సౌరభ్ సేథి సూచించినట్లుగా 14 రోజుల పాటు దీనిని క్రమం తప్పకుండా తీసుకుంటే మీ ఆరోగ్యంలో స్పష్టమైన మార్పును గమనించవచ్చు. అవకాడోను సరిగ్గా తినకపోతే, దాని ప్రయోజనాలు చాలా తక్కువగా ఉంటాయని డాక్టర్ సౌరభ్ సేథి అంటున్నారు. స్నాక్గా తినే అవకాడోలో నెయ్యి, వెన్న లేదా నూనె ఎప్పుడూ కలపవద్దని ఆయన సలహా ఇస్తున్నారు. దీని కోసం, ఒక అవకాడో తీసుకుని, అందులో అర కప్పు పనీర్, 2 టేబుల్ స్పూన్ల పెరుగు, ఒకటి లేదా రెండు పచ్చిమిర్చి, అల్లం-వెల్లుల్లి, కొత్తిమీర, ఉప్పు, మిరియాల పొడి, మీ ఇష్టానుసారం ఒరేగానో వేసుకుని, మీకు నచ్చినట్లుగా కలుపుకోండి. అదే మీ స్నాక్, దీనిని ఉదయాన్నే అల్పాహారంగా తీసుకోండి. ఒకవేళ మీకు పచ్చిగా తినడం ఇష్టం లేకపోతే, పెరుగు తప్ప మిగిలిన పదార్థాలను తక్కువ మంట మీద వేడి చేసుకుని తినమని చెబుతున్నారు.



## సీఎస్ఆర్ స్కాలర్షిప్ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి శ్రీధర్బాబు

### 5,050 మంది విద్యార్థులకు రూ. 4.55 కోట్ల స్కాలర్షిప్ పంపిణీ




**హైదరాబాద్, ఏప్రిల్ 22, (నినాదం):** ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆభరణాల రిటైల్ సంస్థగా, ఒక బాధ్యతాయుతమైన ఆభరణాల బ్రాండ్గా గుర్తింపు పొందిన 'మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్', 2026-27కిగాను తాము ప్రకటించిన రూ. 200 కోట్ల సీఎస్ఆర్ నిధుల కేటాయింపులో భాగంగా, తెలంగాణలోని 5,050 మంది విద్యార్థులకు రూ. 4.55 కోట్ల విలువైన స్కాలర్షిప్లను ఈ రోజు పంపిణీ చేసింది. హైదరాబాద్లోని ఓల్డ్ నల్లకుంటలో ఉన్న ఆర్టీసీ కళ్యాణ మండపంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ స్కాలర్షిప్ పంపిణీ జరిగింది. జాతీయ స్థాయిలో, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ యొక్క సీఎస్ఆర్ కార్యక్రమం 20 రాష్ట్రాల్లోని 1,500కి పైగా ప్రాంతాలను కవర్ చేస్తుంది. ఈ ఏడాది దీని ద్వారా రెండు లక్షల మందికి పైగా లబ్ధి పొందుతారని అంచనా వేస్తున్నారు. విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత , పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో చేపట్టిన కార్యక్రమాలు, సామాజిక ప్రభావంపై ఈ సంస్థకు ఉన్న దీర్ఘకాలిక దృష్టి ద్వారా ఇప్పటికే 18 లక్షల మందికి ప్రయోజనం చేకూరింది. విద్యా రంగంలో, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ గత కొన్నేళ్లుగా 1.15 లక్షల మందికి పైగా విద్యార్థులకు రూ.100 కోట్లకు పైగా స్కాలర్షిప్ సహాయాన్ని అందించింది. 2026--27 ఆర్థిక సంవత్సరానికి గాను, తెలంగాణలోని 5,050 మంది విద్యార్థులతో సహా, భారతదేశ వ్యాప్తంగా 33,000 మంది బాలికా విద్యార్థులకు స్కాలర్షిప్లను ఈ సంస్థ కేటాయించింది. బాలల విద్య పట్ల తమ నిబద్ధతను మరింతగా పునరుద్ఘాటిస్తూ, ఈ సంస్థ ఇప్పటికే 17 రాష్ట్రాల్లో 1,543 సూక్ష్మ-అభ్యాస కేంద్రాలను (మైక్రో -లెర్నింగ్ సెంటర్స్) ఏర్పాటు చేసింది; ఒక లక్ష మందికి పైగా విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో, ఈ నెట్వర్క్ను 2,500 కేంద్రాలకు విస్తరించాలని యోచిస్తోంది. ఆరోగ్యం, మహిళా సాధికారత, విద్య ,పర్యావరణ రంగాల్లో ఈ సంస్థ చేపట్టిన విస్తృత సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా, 'థనల్' 'ప్రథమ్' వంటి సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుని ఈ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. హైదరాబాద్లో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమలు వాణిజ్య శాఖల మంత్రి డి. శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనతో పాటు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ ఇండియా ఆపరేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆషర్ ఓ, 'రెస్ట్ ఆఫ్ ఇండియా ' రిటైల్ హెడ్ సిరాజ్ పి.కె, హైదరాబాద్ జోన్, జోనల్ హెడ్ షరీజ్ కె, ఇతర సీనియర్ ప్రతినిధులు, ఆహ్వానించబడిన ప్రముఖులు విద్యా రంగ నిపుణులు కూడా పాల్గొన్నారు. ప్రాంతీయ స్థాయిలో, తెలంగాణ వ్యాప్తంగా గ్రూప్కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాలు స్కాలర్షిప్లకు మాత్రమే పరిమితం కాకుండా, విద్యా సహాయం, ఆకలి నిర్మూలన, నిత్యావసర వనరుల లభ్యత వంటి కార్యక్రమా లను కూడా కలిగి ఉన్నాయి. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్, వీధి పిల్లలకు మద్దతుగా 49 సూక్ష్మ-అభ్యాస కేంద్రాలను నిర్వహిస్తోంది, తమ వీధి భోజన పంపిణీ కార్యక్రమం ద్వారా రోజుకు 2000కు పైగా భోజనాలను అందిస్తూ, క్షేత్రస్థాయిలో విద్య , పోషణ లభ్యతను మెరుగుపరచడానికి దోహదపడుతోంది.ఈ కార్యక్రమంపై తెలంగాణ ప్రభుత్వ సమాచార సాంకేతికత, ఎలక్ట్రానిక్స్, కమ్యూ నికేషన్స్, పరిశ్రమలు ,వాణిజ్య శాఖల మంత్రి డి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ, "పరిశ్రమల ఆవిష్కరణల ఆధారిత రంగాలలో తెలంగాణ పురోగమిస్తున్న తరుణంలో, ఈ పురోగతికి తోడ్పడే విద్యా పునాదిని బలోపేతం చేయడం కూడా అంతే ముఖ్యం. ఇటువంటి ప్రయత్నాలు, రాష్ట్రం విస్తృత అభివృద్ధి ప్రయాణంలో ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా చేయడం ద్వారా సమ్మిళిత అభివృద్ధికి పరిస్థితులను కల్పించడంలో సహాయపడతాయి" అని అన్నారు. మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎం. పి. అహ్మద్ మాట్లాడుతూ, "వ్యక్తిగత సామాజిక స్థాయిలో దీర్ఘకాలిక ప్రభావాన్ని సృష్టించడానికి విద్య అత్యంత ప్రభావవంతమైన మార్గాలలో ఒకటిగా నిలుస్తుంది. మా స్కాలర్షిప్ కార్యక్రమాల ద్వారా, విజయం సాధించగల సామర్థ్యం ఉండి, తమ చదువులను కొనసాగించడానికి ఆర్థిక సహాయం అవసరమైన విద్యార్థులకు మద్దతు ఇవ్వాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాము" అని అన్నారు. ఈ గ్రూప్ యొక్క సీఎస్ఆర్ కార్యకలాపాలు విద్య, ఆకలి నిర్మూలన, ఆరోగ్య సంరక్షణ, గృహనిర్మాణం, మహిళా సాధికారత పర్యావరణ పరిరక్షణ వంటి రంగాలలో విస్తరించి ఉన్నాయి. ఈ కార్యక్రమాల కోసం గ్రూప్ తన నికర ట్రేడింగ్ లాభంలో ఐదు శాతాన్ని కేటాయిస్తుంది.హైదరాబాద్లోని తెలంగాణ స్కాలర్షిప్ కార్యక్రమంతో, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రాంతీయ మార్కెట్లలో విద్యపై దృష్టి సారించిన తమ సీఎస్ఆర్ ప్రయత్నాలను బలోపేతం చేస్తూనే ఉంది, తద్వారా విద్యార్థులకు నిర్మాణాత్మక స్థిరమైన మద్దతును అందిస్తోంది.

## గంజి నీటితో గ్లోయింగ్ స్కిన్, సిల్కీ హెయిర్.. మీరు మిస్ అవుతున్న బ్యూటీ ట్రిక్!

బియ్యం నానబెట్టిన నీటితో ఎన్ని ప్రయోజనాలున్నాయనే విషయం చాలా మందికి తెలియదు. అందమైన ముఖం, పొడవైన, ఒత్తైన జుట్టు కావాలని కోరుకునే వారికి ఇదొక అద్భుత ఔషధంగా పనిచేస్తుంది.

ఇది చర్మం, జుట్టు సంరక్షణకు చాలా ఉపయోగకరమని నిపుణులు చెబుతున్నారు. దాని ప్రయోజనాలను ఇలా తెలుసుకోవచ్చు. బియ్యం నానబెట్టిన నీటిలో విటమిన్లు, ఖనిజాలు, అమైనో ఆమ్లాలు సమృద్ధిగా ఉంటాయని చెబుతారు. దీనిని ముఖ శుభ్రత కోసం ఉపయోగిస్తే చర్మం మృదువుగా మారుతుందని భావిస్తున్నారు. చర్మ సమస్యలను తగ్గించడంలో కూడా ఇది సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది సహజమైన, తక్కువ ఖర్చుతో లభించే స్కిన్కేర్ ఎంపికగా ఉపయోగపడుతుంది.

ఫేస్ టోనర్గా ఉపయోగం:

రైస్ వాటర్ను టోనర్లా కూడా వాడవచ్చు. కాటన్తో ముఖంపై సున్నితంగా రాసి కొన్ని నిమిషాల తర్వాత చల్లని నీటితో కడిగితే చర్మం తేమగా మారుతుంది. వారానికి రెండు సార్లు ఇలా చేస్తే పొడిబారడం తగ్గుతుందని చెబుతారు. దీని వల్ల చర్మం మెరుపుగా కనిపించడంలో సహాయపడుతుందని అంటారు.

సన్బర్న్ తగ్గించడంలో సహాయం:

ఎండ వల్ల చర్మం కందిపోతే రైస్ వాటర్ ఉపశమనం ఇవ్వగలదని సూచిస్తారు. కాటన్ సహాయంతో ప్రభావిత ప్రాంతంలో మృదువుగా అప్లై చేస్తే మంట తగ్గుతుందని భావిస్తారు.



జుట్టుకు పోషణ:

పోషకాహార లోపం, కాలుష్యం, ఎండ వంటి కారణాలతో జుట్టు బలహీనంగా మారుతుంది. ఇలాంటి సందర్భాల్లో రైస్ వాటర్ లేదా గంజిని తలకు అప్లై చేస్తే ఉపయోగం ఉంటుందని చెబుతారు. ఇందులో ఉండే ఇనోసిటాల్ అనే పదార్థం జుట్టు రాలడాన్ని తగ్గించడంలో సహాయపడవచ్చని పేర్కొంటారు. అమైనో ఆమ్లాలు జుట్టు కుదుళ్లను బలపరచడంలో సహాయపడతాయి.

జుట్టు మృదువుగా, మెరిసేలా:

రైస్ వాటర్తో జుట్టు మరింత సాఫ్ట్గా మారి మెరుపు వస్తుందని అంటారు. దీనికి కొద్దిగా మజ్జిగ కలిపి తలకు పెట్టి 30 నిమిషాల తర్వాత తేలికపాటి షాంపూతో కడిగితే జుట్టు మరింత మృదువుగా మారుతుందని సూచిస్తారు.

చిక్కులు తగ్గించడం:

తరచూ రైస్ వాటర్ ఉపయోగించడం వల్ల జుట్టు మృదువుగా మారి చిక్కులు తగ్గుతాయని చెబుతారు. దీంతో జుట్టును సులభంగా నిర్వహించుకోవచ్చు. వివిధ హెయిర్ స్టైల్స్ చేయడం కూడా సులభమవుతుంది.

## ఐటీ షాక్.. 3 రోజుల వరుస లాభాలకు బ్రేక్




**ముంబయి:** దేశీయ స్టాక్ మారట?్కట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. ఇరాన్తో కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ప్రకటించినప్పటికీ.. శాంతి చర్చల అంశం ఇంకా కొలిక్కి రాకపోవడం సెంటిమెంట్ను దెబ్బతీసింది. దీనికితోడు గరిష్ఠ స్థాయిలో క్రూడాయిల్ ధరలు కొనసాగుతుండడం, ఇటీవల లాభాల నేపథ్యంలో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం వంటివి ప్రభావం చూపాయి. ముఖ్యంగా ఐటీ స్టాక్స్లో అమ్మకాల ఒత్తిడి సూచీలను పడేశాయి. దీంతో సెన్సెక్స్ 750 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 24,400 దిగువకు చేరింది.

అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 79,019.34 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 79,273.33) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల బాటలోనే పయనించింది. ఇంట్రాడేలో 78,442.30 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 756.84 పాయింట్ల నష్టంతో 78,516.49 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 198.50 పాయింట్ల నష్టంతో 24,378.10 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 37 పైసలు క్షీణించి 93.81గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో హెచ్సీఎల్ టెక్నాలజీస్ 10 శాతం మేర నష్టపోయింది. ఇన్ఫోసిస్, మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్, టెక్ మహీంద్రా స్టాక్స్ కూడా నష్టాలు చవిచూశాయి. హిందుస్థాన్ యూనిలీవర్, ఎన్టీపీసీ, ఎటర్నల్, ట్రెంట్, అల్ట్రాటెక్ సిమెంట్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 99 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం 4754 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

ఐటీ స్టాక్స్ ఢమాల్: ఐటీ స్టాక్స్లో అమ్మకాలతో నేడు నిఫ్టీ ఐటీ ఇండెక్స్ దాదాపు 4 శాతం మేర నష్టపోయింది. నిన్న నిరుత్సాహకర క్యూ4 ఫలితాలతో పాటు బలహీన భవిష్యత్ అంచనాలను హెచ్సీఎల్ టెక్నాలజీస్ వెలువరించడం ఇందుకు కారణమైంది. దీంతో హెచ్సీఎల్ స్టాక్ దాదాపు 11 శాతం మేర పతనం కాగా.. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టీసీఎస్ స్టాక్స్ కూడా నష్టాలు చవిచూశాయి. దీంతో సూచీలపై ఒత్తిడి పడింది

## గేమింగ్ రూల్స్ నోటిపై చేసిన కేంద్రం.. మే 1 నుంచి అమల్లోకి

నినాదం
మార్కెట్



దిల్లీ: నగదుతో ముడిపడిన ఆన్లైన్గేమ్లను నిషేధిస్తూ చట్టం తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం.. తాజాగా నిబంధనలను నోటిఫై చేసింది. గతేడాది పార్లమెంట్ ఆమోదం పొందిన ఆన్లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్ను అమలు చేయడానికి అవసరమైన నిబంధనలను కేంద్రం నోటిఫై చేసింది. ఇవి మే 1 నుంచి అమల్లోకి రానున్నాయి. దీంతో పాటు ఆన్లైన్ గేమింగ్ అథారిటీని ఏర్పాటుచేస్తూ కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. ఏ గేమ్ చట్టబద్ధమైనదో, ఏది కాదో నిర్ణయించే అధికారం ఈ అథారిటీకి ఉంటుంది.

రియల్ మనీ గేములు కాకపోతే చాలా వరకు గేములకు తప్పనిసరి రిజిస్ట్రేషన్ చేయాల్సిన అవసరం లేదని ఐటీ సెక్రటరీ ఎస్.కృష్ణన్ తెలిపారు. అయితే, ఈస్పోర్ట్స్ గేములు మాత్రం చట్టంలో పేర్కొన్న ప్రకారం రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఆన్లైన్ మనీ గేమా? సోషల్ గేమా, ఈ-స్పోర్ట్సా అని నిర్ధారించుకోవడం అనేది పూర్తిగా ఐచ్ఛికమని పేర్కొన్నారు. అథారిటీ ఏదైనా గేమ్ను సుమోటోగా చేపట్టడం, ఈస్పోర్ట్స్ గేములు, నిర్దిష్ట సోషల్ గేమ్లను కేంద్రం నోటిఫై చేసిన సందర్భాల్లో మాత్రం గుర్తింపును నిర్ధారించుకోవాల్సి ఉంటుందని స్పష్టంచేశారు.

ఆన్లైన్ గేమింగ్ అథారిటీ ఏర్పాటు: దేశంలో ఆన్లైన్ గేమింగ్ రంగాన్ని క్రమబద్ధీకరించేందుకు ఆరుగురు అధికారులతో అథారిటీని ఏర్పాటు చేసింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి ఛైర్మన్గా, ఎక్స్ అఫీషియోగా ఉంటారని కేంద్రం ప్రకటించింది. హోం శాఖ సంయుక్త కార్యదర్శి, ఆర్థిక వ్యవహారాల సంయుక్త కార్యదర్శి, సమాచార ప్రసార శాఖ సంయుక్త కార్యదర్శి, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ సంయుక్త కార్యదర్శి, న్యాయశాఖ సంయుక్త కార్యదర్శి ఎక్స్ అఫీషియో సభ్యులుగా వ్యవహరిస్తారని పేర్కొంది.

## రూ.15 వేలలోపు చెల్లింపులకు ఇకపై నో ఓటీపీ.. బ్యాంకింగ్ రూల్స్ మార్చిన ఆర్బీఐ.. కొత్త నిబంధనలు ఇవే..

డిజిటల్ చెల్లింపులను మరింత వేగవంతం చేసేందుకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త రూల్స్ ప్రవేశపెట్టింది. ఆటోమేటిక్ ఇ-మాండేట్ ట్రాన్సాక్షన్లకు సంబంధించి కొత్త నిబంధనలను తీసుకొచ్చింది.

ఇక నుంచి కొత్త కార్డు పొందినప్పుడు పాత కార్డుపై ఉన్న ఇ- మాండేట్ చెల్లింపులు కొత్త కార్డుకు ఆటోమేటిక్గా బదిలీ అవుతాయి. ఇ-మాండేట్ చెల్లింపులను సులభతరం చేయడం, సురక్షితంగా కస్టమర్లు నిర్వహించేందుకు ఆర్బీఐ ఈ రూల్స్ ప్రవేశపెట్టింది.

ఈ కొత్త నిబంధనలకు సంబంధించి ఓ ప్రకటన కూడా జారీ చేసింది. కంపెనీలు, వ్యక్తుల నుంచి వచ్చిన సూచనల ఆధారంగా ఇ-మాండేట్ నిబంధనల్లో ఆర్బీఐ మార్పులు చేసింది. ఆటోమేటిక్ చెల్లింపులకు కస్టమర్కు నోటిఫికేషన్ పంపినప్పుడల్లా ఫిర్యాదును ఎలా నమోదు చేయాలనే పూర్తి సమాచారాన్ని కూడా ఇవ్వాలని బ్యాంకులకు ఆర్బీఐ సూచనలు చేసింది. అలాగే ఆటోమేటెడ్ చెల్లింపులపై ఆర్బీఐ మరో కీలక నిర్ణయం కూడా తీసుకుంది.

నెలకు రూ.15 వేల వరకు జరిగే ఆటోమేటిక్ చెల్లింపులకు ఎలాంటి ఓటీపీ, పాస్ వర్డ్ అవసరం లేదని ఆర్బీఐ తన ప్రకటనలో తెలిపింది. ఇంతకంటే ఎక్కువ పేమెంట్స్కు మాత్రమే ఓటీపీ లేదా పాస్ వర్డ్ ధృవీకరణ అవసరమవుతుందని స్పష్టం చేసింది. ఇక ఓటీసీ సబ్స్క్రిప్షన్లు, కరెంట్ బిల్లుల చెల్లింపుల కోసం ఇ-మాండేట్ ఎంచుకున్న వినియోగదారుల నుంచి ఎలాంటి సర్వీస్ ఛార్జీలు లేదా రుసుములు వసూలు చేయవద్దని బ్యాంకులకు ఆర్బీఐ సూచించింది.



ఇక ఇ-మాండేట్ ట్రాన్సాక్షన్లకు సంబంధించి వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు పటిష్టమైన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని బ్యాంకులను ఆదేశించింది. ఇక ఇన్యూరెన్స్ ప్రీమియంలు, మ్యూచువల్ ఫండ్స్ వాయిదాలు, క్రెడిట్ కార్డు బిల్లు చెల్లింపులకు ఓటీపీ లేకుండా రూ.లక్ష వరకు ట్రాన్సాక్షన్ చేయవచ్చని ఆర్బీఐ స్పష్టం చేసింది. డిజిటల్ లావాదేవీలను మరింత వేగంగా నిర్వహించేందుకు ఈ నిర్ణయాలు ఉపయోగపడనున్నాయి.

డిజిటల్ చెల్లింపులు ఇటీవల పెరిగిపోయాయి. ప్రతీఒక్కరి చేతుల్లో స్మార్ట్ ఫోన్ ఉండటంతో నెట్, మొబైల్ బ్యాంకింగ్తో పాటు యూపీఐ సౌకర్యాన్ని ఎక్కువమంది ఉపయోగించుకుంటున్నారు. ఈ విధానాల ద్వారా డిజిటల్ విధానంలో చెల్లింపులు చేస్తున్నారు. ఇప్పటివరకు పేమెంట్స్ కోసం ఓటీపీ ఎంటర్ చేయాల్సి వచ్చేది. కానీ ఇక నుంచి రూ.15 వేలలోపు చేసే చెల్లింపులకు అవసరం లేకపోవడం వల్ల వేగంగా లావాదేవీలు చేయవచ్చు

## థలసేమియా బాధితుల కోసం మెగా ఉచిత వైద్య శిబిరం



**జవహర్‌నగర్, ఏప్రిల్ 22 (నినాదం):** పేదలకు సహాయం చేయండి వారి ప్రాణాలను కాపాడండి(సర్వే ద హ్యూమానిటీ సేవ్ ద పీపుల్స్ లైఫ్) అని థలసేమియా బాధితుల కోసం కాప్రా తహసిల్ కార్యాలయంలో ప్రశాంత్ కార్తీ పీపుల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా రక్తదాన, శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెగా రక్తదానం ఉచిత వైద్య పరీక్షలు సుప్రజ హాస్పిటల్ అండ్ ధన్యూరీ హాస్పిటల్ సౌజన్యంతో టుడి ఎకో టెస్ట్, ఈసీజీ, బీపీ చెక్ అప్ వంటి పలు సేవా కార్యక్రమాలను ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాగూర్, కాప్రా మండల తాసిల్దార్ బైరెడ్డి రాజేష్, జవహర్ నగర్ ఎస్‌ఓటి సిఐ జానయ్య, రమేష్ యాదవ్, ఫౌండేషన్ సభ్యులు, శ్రీ సర్వాణి దుర్గాప్రసాద్, నరేష్ రెడ్డి, మధు గౌడ్, అనిల్ నారాయణ, అవినాష్, చందు, కిరణ్, వంశీ, విగ్నేష్, కాలనీవాసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## మండల ప్రజా పరిషత్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం



**అల్వాల్, ఏప్రిల్ 22 (నినాదం):** మండల ప్రజా పరిషత్ మచ్చ బొల్లారం పాఠశాలలో 5 తరగతి విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం అల్వాల్ మండలం ఎంఈఓ శ్రీ మురళీ కృష్ణ మూర్తి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం శ్రీమతి జయశ్రీ ఉపాధ్యాయ బృందం ప్రతి ,విద్యార్థి ప్రొఫైల్ మరియు 2025-2026 ఇయర్ బుక్ తయారు చేసి ఎంఈఓచే ఆవిష్కరింప చేయడం జరిగింది. ఇందులో విద్యార్థి ఫోటో ,విద్యార్థి అలవాట్లు,ఆదర్శాలు,లక్ష్యాలు,అభిరుచులు,మరియు విద్యార్థి పై ఉపాధ్యాయుల ఆకాంక్షలను పొందుపరిచారు. ఈ ప్రొఫైల్ లను 5 వ తరగతి విద్యార్థులకు అందరికీ అందజేయడం జరిగింది. ఈ విధంగా వినూత్నంగా విద్యార్థుల ప్రొఫైల్ తయారు చేసి విద్యార్థులకు అందజేయడం పట్ల ఎంఈఓ శ్రీ మురళీ కృష్ణ మూర్తి సంతోషం వ్యక్తం చేస్తూ హెచ్ఎం ఉపాధ్యాయులను అభినందించడం జరిగింది.

## గుండారం ప్రాథమిక పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే



**సిద్దిపేట ఏప్రిల్ 22(నినాదం):** గుండారం పాఠశాలలో బుధవారం రోజున యూకేజీ విద్యార్థులకు "గ్రాడ్యుయేషన్ డే "ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉంద్రాళ్ళ తిరుపతి అధ్యక్షత వహించారు . ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం చాలా అరుదు అని, ప్రీ ప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని ,పిల్లలు ఎంత ఉత్సాహంగా పాల్గొన్నారు అని అన్నారు. గుండారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చక్కటి విద్యను తో పాటు వినూత్న కార్యక్రమాలు, నిర్వహిస్తూ వారిని విద్య పట్ల ఆకర్షితులు చేయడం జరుగుతుందని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జంగోని శ్రీనివాస్ ,శిరీష , హరీష విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# భూమిని పరిరక్షించాల్సిన అవసరం అందరిపై ఉంది

### సూరారం కాలనీ జెడ్‌పిహెచ్ఎస్ విద్యార్థులతో ప్రతిజ్ఞ

### పర్యావరణవేత్త, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రొఫెసర్ ప్రసన్నకుమార్





**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 22 (నినాదం):** అంతర్జాతీయ (భూమి దినోత్సవం) ఏప్రిల్ 22 అంతర్జాతీయ ధరిత్రి దినోత్సవ సందర్భంగా బుధవారం సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీ జిల్లా పరిషత్ హై స్కూల్లో అంతర్జాతీయ దరిత్రి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణవేత్త తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రొఫెసర్ ప్రసన్నకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై భూమిని పరిరక్షించుకోవలసిన అవసరం ప్రతి ఒక్కరి పైన ఉన్నదని పేర్కొన్నారు. మనకు నీరు కావాలన్నా, నీడ కావాలన్నా, నివసించాలన్న భూమి ఉండాలనే నిజాన్ని భూమిపై నివసించే ప్రతి వ్యక్తి గుర్తించాలన్నారు. భూమిని పరిరక్షించుకోవాలి, భూమిని మాతృభూమిగా ప్రేమిస్తూ భూమాతను సంరక్షించుకున్నప్పుడే లోకమంతా సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. భూమిపై ఎలాంటి ప్లాస్టిక్ వేయకూడదు, ఇలాంటి చెత్తతో నింపకూడదు. భూమిని సారవంతంగా ఉంచినప్పుడే పంటలు కూడా బాగా పండుతాయని ప్రొఫెసర్ ప్రసన్న కుమార్ వివరించారు. భూమిని సురక్షితంగా కాపాడుకోవాల్సిన బాధ్యతను వివరిస్తూ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలోసామాజిక, పర్యావరణవేత్త కోలా రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, రైతులు రసాయనిక ద్రవాలు వాడకుండా ప్రకృతి వ్యవసాయంను ప్రోత్సహించాలని సూచించారు. పశువుల పేడతో పంటలు పండించాలని, ఎరువులు వాడకుండా భూమాతను కాపాడుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి మీ ఇంట్లో ప్లాస్టికవర్ వాడకుండా మీ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, మార్కెట్ కి వెళ్ళినప్పుడు చేతి సంచులు తీసుకునివెళ్లే విధంగా మీ తల్లిదండ్రులను మార్చాలని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున, పుణ్యవతి, రవికుమార్, జావీద్, లక్ష్మణ్, హనుమంతరావు, వెంకట్రావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# డీప్ ఫేక్, సైబర్ భద్రతపై గీతంలో కార్యశాల





### లాంఛనంగా ప్రారంభించిన ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ నరహరి శాస్త్రి

**పటాన్చెరు, ఏప్రిల్ 22(నినాదం):** గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం (సీఎస్ఈ) ఆధ్వర్యంలో 'సైబర్ భద్రతలో డీప్ ఫేక్ బెదిరింపులు: గుర్తింపు, నివారణ, నైతిక సవాళ్లు' అనే అంశంపై రెండు వారాల (12 రోజుల) అధ్యాపక వికాస కార్యక్రమాన్ని (ఎఫ్ డీపీ) నిర్వహిస్తున్నారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) శిక్షణ, అభ్యాసం (ఏటీఏఎల్) అడ్వాన్స్ డ్ పథకం కింద ఏర్పాటు చేసిన ఈ కార్యశాలను ఐఐటీ హైదరాబాదు ప్రొఫెసర్ డాక్టర్ నరహరి శాస్త్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాథమిక పరిజ్ఞానంలో భారతీయుల శక్తి, సామర్థ్యాలను ప్రముఖంగా ప్రస్తావించారు. డిజిటల్ యుగంలో ముందుకు సాగడానికి కృత్రిమ మేధస్సు (ఏఐ), మెషిన్ లెర్నింగ్, పెద్ద భాషా నమూనాలు (ఎల్ఎల్ఎం) వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికలను మనం స్వీకరించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ఇప్పటికే మనం పారిశ్రామిక విప్లవం, ఆటోమేషన్ వంటి వాటిని అందిపుచ్చుకోలేకపోయామని, కానీ ఈసారి అది పునరావృతం కాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న వారంతా వినూత్న విధానాలను అవలంబించాలని ప్రోత్సహించారు. ప్రతిభను పెంపొందించుకోవాలని, బోధనతో పరిశోధనను అనుసంధానించాలని, సురక్షితమైన డిజిటల్ విధానాన్ని నిర్మించడంపై దృష్టి పెట్టాలని అధ్యాపకులకు డాక్టర్ నరహరి శాస్త్రి సూచించారు. ఇంత మంచి కార్యశాల నిర్వహణ బాధ్యతను తమపై ఉంచినందుకు గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు ఏఐసీటీఈకి కృతజ్ఞతలు తెలియజేశారు. మనం (భారతీయులు) ఎవరికీ తీసిపోమని, జ్ఞాన ఉత్పత్తి, సాంకేతిక ఆవిష్కరణలలో ముందుండి ప్రపంచాన్ని ఏలాలని ఆయన అభిలషించారు. సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ షేక్ మహబూబ్ బాషా ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని గీతంకు తీసుకొచ్చేందుకు కృషిచేసిన అధ్యాపక బృందాన్ని ప్రశంసించారు. కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ అక్కలక్ష్మి తన స్వాగతోపన్యాసంలో అతిథులను ఆహ్వానించారు. ఐఐటీ హైదరాబాదు, ట్రిబుల్ ఐటీ, హైదరాబాదు విశ్వవిద్యాలయం, ఐబీఎం, గూగుల్, టెక్ మహీంద్రా, ఇతర ఐటీ సంస్థల నుంచి ప్రముఖ వక్తలు ఈ రెండు వారాల కార్యశాలలో పాల్గొంటారని తెలియజేశారు. ఆగస్టు 30 వరకు కొనసాగనున్న ఈ అధ్యాపక వికాస కార్యక్రమంలో డీప్ ఫేక్ బెదిరింపుల పెరుగుతున్న ముప్పుకు వ్యతిరేకంగా సైబర్ భద్రతను బలోపేతం చేయడంపై ఇందులో పాల్గొనేవారికి విలువైన అంతర్దృష్టులను అందించనున్నారు.

## జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సత్తాచాటిన శ్రీచైతన్య విద్యార్థులు



**ఎల్ బినగర్, ఏప్రిల్ 22 (నినాదం):** జేఈఈ మెయిన్స్ ఫలితాలలో శ్రీచైతన్య దిల్సుఖ్నగర్ డే స్కాలర్స్ ఐఐటీ జోన్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబ రిచి మంచి ర్యాంకులను సాధించారని కళాశాలల డీన్స్ డాక్టర్ ఆదిరెడ్డి, కె.తిరుమల్రావు వెల్లడిం చారు. ఆర్కేపురం క్యాంపస్ లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. వందలోపు ఓపెన్ కేటగిరీలో 27 మంది, వెయ్యిలోపు 166 మంది ర్యాంకులు సాధించారని డీన్స్ తెలిపారు. 2వేలలోపు 10 మంది, ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 150 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించారని పేర్కొన్నారు. అన్ని కేటగిరీల్లో కలిపి 300కు పైగా విద్యార్థులు అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా వారు విద్యార్థుఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతోడీన్స్ ఆదిరెడ్డి, తిరుమల్రావు, అధ్యాపకులులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎంలు సతీష్ రెడ్డి, కోట శ్రీనివాసులు, రవిప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అభ్యాస జూనియర్ కాలేజీలో రాష్ట్రస్థాయిలో ప్రభంజనం




**అల్వాల్, ఏప్రిల్ 22 (నినాదం):** శ్రీ అభ్యాస జూనియర్ కాలేజ్ లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ తరపున మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఘనంగా సత్కరించారు. పేద ఉత్తమ విద్యార్థులకు ఎం ఎస్ ఎస్ ఓ పేద విద్యార్థులకు అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులు జి యోగేశ్వర్ సెకండ్ ర్యాంక్, వైష్ణవి, జరీనా బేగం, గీతిక, రేచల్. ఈ కార్యక్రమంలో తోట గోపాల్ రెడ్డి ,తోట లక్ష్మీకాంతరెడ్డి, ప్రేమ్ కుమార్ ,నిమ్మ అశోక్ రెడ్డి ,శ్రీ అభ్యాస జూనియర్ కాలేజ్ డైరెక్టర్ విశాల్ ,చైర్మన్ స్వామి గౌడ్, మహేందర్ గౌడ్, పూర్ణచందర్, వినీత, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అల్వాల్ సర్కిల్‌లో ఎన్నికల మ్యాపింగ్

# పూర్తి చేయడానికి ప్రత్యేక ప్రచారం

**అల్వాల్, ఏప్రిల్ 22 (నినాదం):** అల్వాల్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు మరియు వారి ఆధీన సిబ్బంది 2002 ఎన్నికల జాబితా ఆధారంగా ఎన్నికల మ్యాపింగ్ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయాలని అధికారులు సూచించారు. ఈ మేరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితాల శుద్ధి, ధృవీకరణ మరియు సమగ్రతను నిర్ధారించేందుకు ఈ కార్యక్రమం చేపట్టబడింది. ప్రతి ఉద్యోగి తమకు కేటాయించిన పరిధిలోని ఓటర్ల వివరాలను పరిశీలించి, సంబంధిత బూత్ లెవెల్ అధికారులు ను సంప్రదించి ఎన్నికల మ్యాపింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అధికారులు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడానికి ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు కావడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. 2002 ఎన్నికల జాబితాను ప్రామాణికంగా తీసుకుని ప్రస్తుత ఓటర్ల వివరాలను సరిపోల్చి లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని సూచించారు. అల్వాల్ సర్కిల్ పరిధిలోని ఉద్యోగులు ఎన్నికల మ్యాపింగ్‌కు సంబంధించిన వివరాలు లేదా సహాయం కోసం 23నుండి 25 వరకు సంబంధిత అల్వాల్ అధికారులను ప్రత్యేకంగా క్యాంపు ఏర్పాటు చేసి ఉన్నారు కావున ప్రభుత్వ ఉద్యోగులందరూ ఇట్టి అవకాశాన్ని వినియోగించుకోగలరు.

# సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 22 (నినాదం):** కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గం వల్లభాయ్ పటేల్ నగర్, అంబేద్కర్ నగర్ వాసులు ఎదుర్కొంటున్న ఇంటి నిర్మాణ పన్నులు, జరిమానాల గురించి బుధవారం సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్ సృజన ఐఏఎస్ ను కలిసి సమస్య వివరించారు. గాజులరామారం సర్కిల్లోని వల్లభాయ్ పటేల్ నగర్, అంబేద్కర్ నగర్ వాసులు ఎదుర్కొంటున్న అక్రమ ఇళ్ల నిర్మాణాలు అంటూ మున్సిపల్ సిబ్బంది జారీ చేస్తున్న జరిమానాల గురించి సిఎంసి సృజన ఐఏఎస్ కు వివరిస్తూ వినతి పత్రం అందజేశారు. ఈ కాలనీల ప్రజలు గత 30 సంవత్సరాల క్రితం నిర్మించుకున్న ఇళ్లకు అన్ని అనుమతులు ఉన్నప్పటికీ ఇవి అక్రమ ఇళ్ల నిర్మాణాలు అంటూ మున్సిపల్ సిబ్బంది విధిస్తున్న జరిమానాలను తక్షణమే ఉపసంహరించి న్యాయం చేయాలని కమిషనర్ కు విన్నవించారు. ప్రజల సమస్యలు పూర్తిగా విన్న సైబరాబాద్ కమిషనర్ సృజన జరిమానాలు వేసిన సంబంధిత మున్సిపల్ అధికారులతో మాట్లాడి సమస్యను పూర్తిస్థాయి లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు కూడా శ్రీశైలం గౌడ్ కార్యాలయ వర్గాలు ప్రకటనలో వివరించారు. కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని ఆరు సర్కిలలో చేపట్టవలసిన అభివృద్ధి పనులకు సంబంధించి సమగ్ర వివరాలను సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ కు అందజేశారు, ఈ పనులు ప్రభుత్వం నుండి మంజూరైనప్పటికీ ప్రస్తుతం కొన్ని టెండర్ ప్రక్రియలో ఆగిపోవడం జరిగిందని, వాటిని వేగవంతం చేసి పనులు ప్రారంభించాలని కమిషనర్ ను కోరారు. కమిషనర్ తో పాటు కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ సైతం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, బుచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్ ఆగం పాండు, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, మోటే శ్రీనివాస యాదవ్ అరువ వెంకట్,సాయికిరణ్, గోపాల్ రెడ్డి గుమస్తా మధుసూదన్ మరియు వల్లభాయ్ పటేల్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామ్ రెడ్డి, మరియు సభ్యులు ఎన్ వి రెడ్డి, కృష్ణ, రాము, బుచ్చిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, లక్ష్మారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మాణిక్య రెడ్డి, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రధానిని అవమానించడం అంటే దేశ ప్రజలను అవమానించడమే..

### ఖర్గేను కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుండి వెంటనే భర్తరఫ్ చేయండి

### బిజెపి పశ్చిమ శాఖ అధ్యక్షులు కలికోట కమలాకర్



**జవహర్ నగర్, ఏప్రిల్ 22 (నినాదం):** దేశ ప్రధాని నరేంద్ర మోడీని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అవమానించడం దేశానికే అవమానకరమన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే ఇటీవల తమిళనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని నీ కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ పశ్చిమ శాఖ అధ్యక్షుడు కలికోట కమలాకర్ ఆధ్వర్యంలో రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రామచంద్రరావు ఆదేశాల మేరకు మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ సూచన మేరకు బుధవారం బాలాజీ నగర్ ప్రధాన రహదారిలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఖర్గే దిష్టిబొమ్మ దహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పశ్చిమ శాఖ అధ్యక్షులు కమలాకర్ హాజరై మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధానిని అవమాన పరచడం దేశ ప్రజలను అవమానపరచడమేనన్నారు. ఇందుకు మల్లికార్జున ఖర్గేను కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుండి వెంటనే భర్తరఫ్ చేయాలని, దేశ ప్రజల మనోభావాలని గౌరవిస్తూ కాంగ్రెస్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేవైఎం నాయకులు సంతోష్ గుప్తా, మాజీ కార్పొరేటర్ పానుగంటి బాబు, వేపుల సన్ని, ఎల్లగాని మహేష్ గౌడ్, రాజేశ్వరి, నవీన్, లక్ష్మీరెడ్డి, రాఘవేంద్ర చారి, సందీప్ ,శశాంక్ సింగ్, రాహుల్, రాజు నాయక్, సాయినాథ్, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గరీబోళ్ల కళ్ళల్లో ఆనందం చూడడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం

### జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి శ్రీకాంత్ యాదవ్



**జవహర్‌నగర్, ఏప్రిల్ 22 (నినాదం):** గరీబోళ్ల కళ్ళల్లో ఆనందం చూడడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ఆరు గ్యారంటీ పథకాలతో తెలంగాణ స్వర్ణయుగంలా మారుతుందని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ అన్నారు. మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ , కీసర సర్కిల్ పరిధి జవహర్ నగర్ బి జె ఆర్ నగర్ లో నూతనంగా నిర్మాణమైన ఇందిరమ్మ ఇళ్లను హౌసింగ్ డీఈ అశోక్ కుమార్, ఏ ఈ శ్రీహరి లతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ అర్హులైన పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని, సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ సారథ్యంలో జవహర్ నగర్ లో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ళు వచ్చాయని, లబ్ధిదారులు ఇళ్ళు పూర్తయినందుకు సంతోషంగా ఉన్నారని అన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్లా వినయ్ కుమార్, సీనియర్ నాయకులు బొబ్బిలి మంజుల , మాట్లా శ్రీనివాస్, రాజు యాదవ్, నాయకం భాస్కర్ పటేల్, అజయ్ కుమార్, యాదగిరి యాదవ్, వీర్ల బుజ్జి, ప్రభాకర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికులు సమ్మె చేయొద్దు మాయా మాటలను నమ్మొద్దు

### టీజీఎస్ఆర్టీసీ సిబ్బందికి ఎండి నాగిరెడ్డి సూచన



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 22 (నినాదం) :** ప్రజా రవాణా ఆర్టీసీ సంస్థ ప్రయాణికుల సేవే పరమావధిగా పనిచేస్తోందని ఇటీవల వివిధ యూనియన్లు ఇచ్చిన సమ్మె నోటీసులపై స్పందిస్తూ కార్మిక శాఖ, యాజమాన్యం ఇప్పటికే ఐఏఎస్ అధికారులతో కూడిన కమిటీతో చర్చల ప్రక్రియను ప్రారంభించింది. కార్మికులందరూ చట్టపరమైన అంశాలను గమనించాలని సూచించారు. పారిశ్రామిక వివాదాల చట్టం, 1947లోని సెక్షన్ 22(1)(డి ) ప్రకారం ఆర్టీసీ సంస్థ కార్మికులు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచే అధికారి వద్ద ఒక వివాదం పెండింగ్‌లో ఉన్నప్పుడు సమ్మెకు దిగడం చట్టవిరుద్ధమన్నారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వారి వద్ద ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నందున సమ్మెకు వెళ్లడం చట్టరీత్యా చెల్లదని ఆర్టీసీ ఎండీ తెలిపారు. ఆర్టీసీ కార్మికులు చట్టవిరుద్ధమైన సమ్మెలో పాల్గొనడం వల్ల వేతన కోతతో పాటు, ఉద్యోగ నిబంధనల ప్రకారం కఠినమైన క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని ఇది కార్మికుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. కార్మికుల సంక్షేమం కోసం చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడానికి యాజమాన్యం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు . ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా, సంస్థ ప్రతిష్ఠను కాపాడవలసిన బాధ్యతను గుర్తించాలని ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ ఎండి వై నాగిరెడ్డి (ఐపీఎస్) పి ఆర్ ఓ ప్రసన్నకుమార్ పత్రికా ప్రకటనలో సూచించారు.

## మరకత శ్రీ లక్ష్మీ గణపతికి విశేష పూజలు



**అల్వాల్, ఏప్రిల్ 22 (నినాదం)** కానాజీ గూడ డైరీ ఫార్మ్ రోడ్లో వెలసినమరకత శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానం కానాజిగూడలో శుభ బుధవారం శ్రీవారికి ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించిన ఆలయ వ్యవస్థాపకులు కార్యనిర్వహకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి ప్రతి బుధవారం స్వామివారికి వేకువ జామున సుప్రభాత సేవ ప్రత్యేక అలంకరణ లక్ష్మీ గణపతి హోమం 32 ఔషధీకృత ద్రవ్యాలతో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. శాస్త్రి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి భూ దాన యజ్ఞం కొనసాగుతున్నదని భక్తులు తమకు తోచిన విధంగా ఆలయ అభివృద్ధికి పాటుపడాలని భక్తులను కోరారు అన్నం పరబ్రహ్మ స్వరూపమని అన్నదాన ట్రస్ట్ కు విరాళాలు అందించాలని భక్తుల కు విన్నవించారు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు

# హైకోర్టు తీర్పు తర్వాత కాళేశ్వరంపై రాజకీయ దుమారం

### బీజేపీ-బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ నేత చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఫైర్



**దుబ్బాక, ఏప్రిల్ 22( నినాదం):** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ నివేదికకు సంబంధించి తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కమిషన్ నివేదిక ఆధారంగా తక్షణ చర్యలు తీసుకోవద్దని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశించింది. అలాగే, నివేదిక రూపకల్పనలో విధానపరమైన నిబంధనలు పూర్తిగా పాటించలేదని అభిప్రాయపడింది. అయితే, కమిషన్ ఏర్పాటు చట్టబద్ధమేనని కోర్టు స్పష్టం చేయడం గమనార్హం. ఈ నేపథ్యంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. హైకోర్టు తీర్పును తాము గౌరవిస్తున్నామని పేర్కొన్న ఆయన, కోర్టు ఎక్కడా కమిషన్‌ను గానీ, దాని విచారణను గానీ, నివేదికను గాని తప్పుబట్టలేదని స్పష్టం చేశారు. కేవలం విధానపరమైన అంశాలపైనే అభ్యంతరం వ్యక్తం చేసిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందని ఆరోపిస్తూ, ఈ కుంభకోణానికి బాధ్యులైన వారిని చట్టం ముందు నిలబెట్టి జైలుకు పంపడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. ప్రజల డబ్బుతో నిర్మించిన ప్రాజెక్టును దోపిడీకి వేదికగా మార్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో బీజేపీపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం అంశంపై బీజేపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. గతంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ ప్రాజెక్టును బీఆర్ఎస్‌కు 'ఏటీఎం'గా అభివర్ణించారని గుర్తు చేశారు. దోషులను జైలుకు పంపుతామని చెప్పిన కిషన్ రెడ్డి, బండి సంజయ్ వంటి నేతలు ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సీబీఐ ద్వారా విచారణ ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నిస్తూ, బీజేపీ-బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందం ఉన్నదనే అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో నిజాలు బయటపడకుండా అడ్డుకోవడమే రెండు పార్టీల లక్ష్యమని విమర్శించారు. మొత్తంగా హైకోర్టు తీర్పు కాళేశ్వరం అంశంపై రాజకీయ వేడి మరింత పెంచగా, భవిష్యత్తులో ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపు తిప్పే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# నాణ్యతే 'లక్ష్యం'.. ప్రగతే 'పథం'

## రూ. 6.50 కోట్లతో బీటీ రోడ్డు పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన

- వర్షాకాలం లోపే నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం
- ఏదులాపురం మున్సిపాలిటీకి రూ. 16.70 కోట్లతో అభివృద్ధి పనులు
- త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ

**ఖమ్మం ప్రతినిధి, ఏదులాపురం, ఏప్రిల్ 22 (నినాదం )**





ప్రభుత్వ పనుల్లో కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని, నాణ్యతతో కూడిన రహదారులను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని చింతపల్లి నుంచి ముత్తగూడెం వరకు రూ. 6.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు.

**గడువులోగా పనులు పూర్తి కావాలి**

శంకుస్థాపన అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈ లోపే రహదారి పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడకూడదని స్థానిక ప్రజాప్రతినిధులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. గతంలోనే ముత్తగూడెం అభివృద్ధి కోసం రూ. 16.70 కోట్లు మంజూరు చేశామని, త్వరలోనే మున్సిపాలిటీ వ్యాప్తంగా మరిన్ని సీసీ రోడ్లు, డ్రైన్ల పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

**అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం**

తమ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమాంతరంగా అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్ వంటి పథకాలతో ప్రజలకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామని, త్వరలోనే రెండో విడత పంపిణీ ప్రక్రియను ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, ప్రత్యేక అధికారి రమేష్, ఆర్&బి ఎస్ఈ యాకోబు, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు తీర్పు హర్షణీయం



## మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 22 (నినాదం)**

కాలేశ్వరం పై పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు తీర్పు హర్షనీయమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ పై బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పుకు ఆయన స్వాగతించారు. హైకోర్టు తీర్పుతోనైనా కాంగ్రెస్ కక్ష పూరిత విధానాలను మార్చుకొని బుద్ధి తెచ్చుకోవాలని సూచించారు. తెలంగాణ జీవధార కాళేశ్వరం మీద నిందలు మోపి బీఆర్ఎస్, కేసీఆర్ ప్రతిష్ట దెబ్బ తీసేందుకు కాంగ్రెస్, బీజేపీ లు వాడుకున్నాయని చెప్పారు.రెండున్నరేళ్లు మరమ్మతులు చేపట్టకుండా అడ్డుకున్నారని, చివరకు గత్యంతరం లేక మరమ్మతులు చేపడుతున్నారని ఆయన అన్నారు. కాళేశ్వరం విషయంలో కేసీఆర్ మీద చేసిన ఆరోపణలకు కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తెలంగాణ ప్రజలకు, రైతాంగానికి క్షమాపణలు చెప్పాలని నిరంజన్ రెడ్డి కోరారు

# సల్మాన్, వంశీ పైడిపల్లి మూవీకి క్లాప్



బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్, టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్టఎ స్‌వి63 ముంబైలో ఘనంగా ప్రారంభమైంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అధికారిక వీడియోను చిత్ర యూనిట్ విడుదల చేసింది. దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇది సల్మాన్ ఖాన్ కెరీర్‌లోనే ఒక ప్రత్యేకమైన యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఉండబోతోందని సమాచారం. ఇక మొదటిసారి సల్మాన్ ఖాన్‌ను వంశీ పైడిపల్లి డైరెక్ట్ చేస్తుండటంతో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇందులో లేడీ సూపర్ స్టార్ నయనతార హీరోయిన్‌గా నటిస్తోంది.

# గడువుకు ముందే 86% రేషన్ పంపిణీ

## రాష్ట్ర సివిల్ సప్లైస్ శాఖ వెల్లడి

**హైదరాబాద్, ఏప్రిల్ 22 (నినాదం):**




తెలంగాణ రాష్ట్రంలో రేషన్ బియ్యం పంపిణీ వేగంగా కొనసాగుతోందని సివిల్ సప్లైస్ రాష్ట్ర శాఖ బాధ్యులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ లేఖ విడుదలచేసారు. ఈ నెలకు కేటాయించిన బియ్యం కోటాలో 85 శాతానికి మించి ఏప్రిల్ 30 గడువుకంటే ముందుగానే సివిల్ సప్లైస్ శాఖ విజయవంతంగా పంపిణీ చేసిందని సదరు లేఖలో పేర్కొన్నారు. ఏప్రిల్ 21 నాటికి రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులకు 5.48 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా బియ్యాన్ని అందజేసినట్లు తెలిపారు. మార్చి 2న కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ వేగవంతమైన పంపిణీ చేపట్టామన్నారు.రాబోయే కొనుగోలు సీజన్‌కు ముందు రవాణా, నిల్వ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఏప్రిల్, మే, జూన్ 2026 త్రైమాసికానికి సంబంధించిన ధాన్యాల లిఫ్టింగ్, పంపిణీ ముందుగానే పూర్తి చేయాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించినట్లు తెలిపారు. మొత్తం 6,43,303 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయింపులో ఇప్పటికే 5,48,140 మెట్రిక్ టన్నులు పంపిణీ చేయడం జరిగిందని, ఇంకా ఎనిమిది రోజులు మిగిలి ఉండగానే 86 శాతం పూర్తి చేయడం విశేషంగా భావిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 2.62 కోట్లకు పైగా లావాదేవీలు నమోదు కావడం ద్వారా ఈ కార్యక్రమం విస్తృత స్థాయిలో అమలవుతున్నట్లు స్పష్టమవుతోందన్నారు. ఈ ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ, డిజిటల్ లావాదేవీలతోపాటు లబ్ధిదారుల ధృవీకరణలను ఫెయిర్ ప్రైస్ షాపుల్లో స్వతంత్రంగా నిర్వహిస్తూ పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం

## ఒకే రోజు కోటిపైగా సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

### ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

### కోరుట్ల నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు





**కోరుట్ల, ఏప్రిల్ 22 (నినాదం)**

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్,కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. కోరుట్ల పట్టణంలోని జివిస్ గార్డెన్ లో బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్,కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు, మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ హాజరై సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కోరుట్ల నియోజకవర్గంలోనే భారీగా ఒక్కరోజులోనే కోటికి పైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తుందని ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందుకు నిదర్శనం అన్నారు. ఒక్క రోజులోనే రూ.1 కోటి 5 లక్షల 46 వేల విలువైన చెక్కులు 315మంది లబ్ధిదారులకు అందించామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ నిస్సహాయకు లకు సహాయం అందించటం ఆనందమేనన్నారు. భారత దేశానికి స్వాతంత్ర్య వచ్చిన తర్వాత పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసే పార్టీ ఏదైనా ఉందా అంటే అది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగున్నప్పటికీ అభివృద్ధి సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ 75 వేల కోట్లు అప్పు చేస్తే పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 8 లక్షల కోట్ల అప్పులు చేసిందని ధ్వజమెత్తారు. కాలేశ్వరం ప్రాజెక్టు పేరుతో బీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిందని ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన నాడు మిగులు బడ్జెట్ గా ఉన్న రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత బిఆర్ఎస్ పార్టీ దేనన్నారు. వారు చేసిన అప్పులకు నెలకు 6వేలకోట్ల అప్పు కడుతున్నాం అని ఓ పక్క ఆర్థిక ఇబ్బందు ల్లో ఉన్నప్పటికీ, రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో నిరంతరం కొనసాగిస్తున్నాం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో శ్రీరాంసాగర్, నాగార్జునసాగర్, పోచంపాడు, ఎల్లంపల్లి వంటి ప్రాజెక్టులను నిర్మిస్తే గడిచిన 10 ఏళ్లుగా టిఆర్ఎస్ పాలన లో కేవలం కాలేశ్వరం ప్రాజెక్టు కట్టింది అది కూడా నాణ్యత లోపంతో నేడు కుంగిపోయి కూలిపోయే పరిస్థితిలో ఉందన్నారు. బీఆర్ఎస్ నేతలు కేవలం డబ్బులు సంపాదించడం, ఆస్తులు సంపాదించుకోవడం కోసమే పాలన చేశారే తప్ప ప్రజల అభివృద్ధి సంక్షేమం పట్ల ఏనాడు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కాలేశ్వరం ప్రాజెక్టు పై క్లిక్ షిప్ వచ్చిందని బిఆర్ఎస్ నేతలు ప్రచారం చేసుకుంటున్నారని అందులో ఏమాత్రం నిజం లేదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 5 గ్యారంటీలను అమలు చేశామని మరో గ్యారంటీని కూడా త్వరలోనే అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నియోజక వర్గం ఓ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేయడానికి



కృషి చేస్తుందన్నారు. తెలంగాణ మిగతా రాష్ట్రాలకు రోల్ మోడల్ అన్నారు. ఇచ్చిన మాట తప్పని కాంగ్రెస్ పార్టీ 6గ్యారెంటీ లలో 5 గ్యారంటీ లను ఇప్పటికే అమలు చేసిందని మరొ గ్యారంటీ కూడా త్వరలో అమలు చేస్తామన్నారు. రూ. 200 కోట్ల తో ప్రతి నియోజకవర్గాని ఒక రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం కోరుట్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ ఒకే రోజు రూ. 1కోటి 5లక్షల 46వేల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ చేయడంతో పేద, మధ్యతరగతి వారికి చేదోడు వాదోడుగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తోందన్నారు. నేటి వరకు కోరుట్ల నియోజక వర్గంలో 1600 మందికి రూ. 6 కోట్ల 50 లక్షలు పైగా సీఎం సహాయ నిధి ద్వారా చెక్కులు అందించి ఆర్థిక ఇబ్బందులతో అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి చికిత్సకై ఖర్చు అయిన డబ్బులను అందజేయడమే ముఖ్యమంత్రి సహాయనిధి ముఖ్య ఉద్దేశం అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఇంత పెద్ద మొత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. స్వర్గీయ మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు తో కలిసి రాజకీయ అరంగేట్రం చేసిన ప్రతి ఒక్కరూ ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలు అందించా మన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రొసిడింగ్ తీసుకున్న ప్రతి ఒక్కరు కూడా ఇంటి నిర్మాణాలు త్వరగా చేపట్టుకోవాలని ఇంటి నిర్మాణం ఏ విధంగా జరిగితే ఆ ఇంటి యజమాని ఖాతాలో డబ్బులు జమవుతాయని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు మంజూరు చేయడమే కాకుండా రేషన్ దుకాణాల ద్వారా దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యాన్ని పంపిణీ చేయడం ఒక చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. మహిళల కు ఉచిత బస్సు ప్రయాణం 200 వరకు ఉచిత విద్యుత్ రూ. 500లకే సిలిండర్ను ప్రభుత్వం అందజేస్తుందని, గత అసెంబ్లీ ఎన్నికల ఇచ్చిన హామీలని ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. కొండ్రికర్ల బ్రిడ్జి నిర్మాణం కోసం మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు బాండ్ పేపర్ రాసి ఇచ్చి 10 ఏళ్ల పదవిని అనుభవించారే తప్ప బ్రిడ్జి నిర్మాణం చేయకుండా కాలయాపన చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత విషయాన్ని మంత్రి సీతక్క దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించిన బ్రిడ్జి నిర్మాణం కోసం విధులు మంజూరు చేసి టెండర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. త్వరలోనే బ్రిడ్జి నిర్మాణం చేపడతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద మధ్యతరగతి ప్రజల ఎల్లవేళలా అండగా ఉంటూ అభివృద్ధి సంక్షేమ ధ్యేయంగా కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, మెట్పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, కోరుట్ల మార్కెట్ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ షాహిద్ ఉల్ ఆహద్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, వివిధ మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్ లు, డైరెక్టర్లు పలువురు కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





NINADAM CINEMA

# సిటాడెల్-2 సీజన్‌లో ప్రియాంక చోప్రా

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా, హాలీవుడ్ నటుడు రిచర్డ్ మాడెన్ ప్రధాన పాత్రల్లో నటించిన యాక్షన్ స్పై థ్రిల్లర్ సిరీస్ 'సిటాడెల్' రెండో సీజన్‌కు సంబంధించి అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సిరీస్ అధికారిక ట్రైలర్‌ను విడుదల చేస్తూ.. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న స్ట్రీమింగ్ తేదీని ప్రకటించింది. ఈ సిరీస్‌ను మే 6 నుంచి స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు ప్రకటించింది. ఇంగ్లీష్‌తో పాటు తెలుగు, హిందీ, తమిళం, మలయాళ భాషల్లో ఈ సిరీస్ అందుబాటులోకి రాబోతోంది. ఈ రెండో సీజన్ ట్రైలర్ గమనిస్తే.. ఫస్ట్ పార్ట్ కంటే ఇందులో మరింత యాక్షన్ ఉండబోతున్నట్లు తెలుస్తుంది. నాడియా సిన్ (ప్రియాంక), మేసన్ కేన్ (రిచర్డ్) మరియు బెర్నార్డ్ ఓర్లిక (స్టాన్లీ టుచి) తమ గతాన్ని గుర్తుకు తెచ్చుకుంటూనే, సిటాడెల్ సంస్థను నాశనం చేసిన క్రూరమైన 'మాంటికోర్' నెట్‌వర్క్ నుంచి ప్రపంచాన్ని రక్షించే భారీ మిషన్‌లో తలపడబోతున్నారు. హాలీవుడ్ ప్రముఖులు జాక్ రేనర్, మ్యాట్ బెర్రీ వంటి వారు కొత్తగా ఈ సీజన్‌లో భాగం కాగా, రూసో బ్రదర్స్ నిర్మాణ విలువలు ఈ సిరీస్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాయి. ప్రస్తుతం రాజమౌళి మహేష్ బాబు కాంబినేషన్‌లో వస్తున్న 'వారణాసి' సినిమా షుటింగ్‌లో ప్రియాంక చోప్రా బిజీగా ఉన్నప్పటికీ, ఆమె తన గ్లోబల్ ప్రాజెక్ట 'సిటాడెల్'తో అంతర్జాతీయ స్థాయిలో మరోసారి తన సత్తా చాటడానికి సిద్ధమైంది.

# కొత్త గృహంలోకి ప్రవేశించనున్న అల్లు అర్జున్

## జూబ్లీహిల్స్‌లో ఖరీదైన ఇంటి నిర్మాణం



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పాన్ ఇండియా స్థాయిలో తన క్రేజ్‌ను రోజు రోజుకు పెంచుకుంటూ, సంపాదనలోనూ కొత్త రికార్డులు సృష్టిస్తున్నారు. 'పుష్ప' సినిమాతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఆయన, సినిమాల ద్వారా మాత్రమే కాకుండా బ్రాండ్ ఎండార్స్‌మెంట్లు, భారీ రెమ్యునరేషన్లతో టాలీవుడ్‌లో అత్యధిక ఆదాయం పొందుతున్న నటులలో ఒకరిగా నిలిచారు. ఈ విజయాలకి తగ్గట్టుగానే ఆయన జీవనశైలిని కూడా విలాసవంతంగా తీర్చిదిద్దుకుంటున్నారు. ఇప్పటికే సినీ రంగంలోనే కాకుండా వ్యాపార రంగంలో కూడా అడుగుపెట్టిన బన్నీ, 'అల్లు స్టూడియోస్' నిర్మాణంతో తన విజన్‌ను చూపించారు. ఇప్పుడు అదే స్థాయిలో తన వ్యక్తిగత జీవితంలో కూడా ఓ భారీ ప్రాజెక్టును పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. హైదరాబాద్‌లోని అత్యంత ఖరీదైన ప్రాంతమైన జూబ్లీహిల్స్‌లో ఆయన నిర్మిస్తున్న కొత్త మేన్షన్ ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపికగా మారింది.ఈ లగ్జరీ హౌస్ సుమారు 4 వేల చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మితమవుతోంది. అత్యాధునిక సదుపాయాలు, ప్రీమియం ఇంటీరియర్స్, ప్రత్యేక డిజైన్‌లతో ఈ ఇంటిని అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ముఖ్యంగా ఈ మేన్షన్ నిర్మాణానికి దాదాపు రూ.80 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ఇది పూర్తయితే జూబ్లీహిల్స్‌లోనే అత్యంత ఖరీదైన మరియు స్టైలిష్ ఇళ్లలో ఒకటిగా నిలవనుంది. ఈ మేన్షన్ మరో ప్రత్యేకత ఏమిటంటే, ఇది మెగాస్టార్ చిరంజీవి నివాసానికి సమీపంలోనే ఉండటం.సినీ కుటుంబం మధ్య ఉన్న అనుబంధాన్ని ప్రతిబింబించేలా ఈ ఇంటి లొకేషన్ కూడా ప్రత్యేక ఆకర్షణగా మారింది.

# కేజీఎఫ్3పై యష్ క్లారిటీ



కన్నడ సినీ పరిశ్రమ స్థాయిని పెంచిన 'కేజీయఫ్' ఫ్రాంచైజీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో, హీరో యష్ ప్రధాన పాత్రలో వచ్చిన 'కేజీయఫ్ చాప్టర్ 1', 'కేజీయఫ్ చాప్టర్ 2' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించాయి. ఈ రెండు భాగాల విజయంతో మూడో భాగం 'కేజీయఫ్ 3'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'కేజీయఫ్ 2' చివర్లో కథను పూర్తిగా ముగించకుండా వదిలేయడం వల్ల మూడో భాగం తప్పకుండా వస్తుందనే నమ్మకం అభిమానుల్లో ఏర్పడింది. ఇదే విషయంపై తాజాగా హీరో యష్ స్పందిస్తూ... 'కేజీయఫ్ 3' ఖచ్చితంగా ఉంటుందని స్పష్టం చేశారు. అయితే ఈ సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుంది, ఎప్పుడు విడుదలవుతుంది అన్న విషయంపై మాత్రం ఆయన స్పష్టత ఇవ్వలేదు. యష్ తెలిపిన ప్రకారం, ఈ ప్రాజెక్ట్‌కు ఇంకా సమయం పడే అవకాశముంది. దర్శకుడు ప్రశాంత్ నీల్‌తో తరచూ ఈ సినిమా గురించి చర్చలు జరుగుతున్నాయని, సరైన సమయం వచ్చినప్పుడు ఈ ప్రాజెక్ట్ మొదలవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఇద్దరూ తమ తమ ప్రాజెక్టులతో బిజీగా ఉండటం వల్ల 'కేజీయఫ్ 3' ఆలస్యమవుతోందని సమాచారం. ప్రస్తుతం యష్ వరుసగా భారీ చిత్రాల్లో నటిస్తున్నారు. 'టాక్సిక్', 'రామాయణ పార్ట్ 1', 'రామాయణ పార్ట్ 2' వంటి ప్రాజెక్టులు సెట్స్‌పై ఉన్నాయి. మరోవైపు ప్రశాంత్ నీల్ కూడా జూనియర్ ఎన్టీఆర్‌తో 'డ్రాగన్' సినిమా చేస్తూ బిజీగా ఉన్నారు. అదేవిధంగా 'సలార్ 2' కూడా ఆయన ప్లాన్‌లో ఉంది. ఈ పరిస్థితుల్లో ఇద్దరి షెడ్యూల్స్ కలిస్తేనే 'కేజీయఫ్ 3' ముందుకు సాగే అవకాశం ఉంది.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787